అరచేతిలో పట్టినంత చక్కెర చాలా కొద్దిగా సోడా ఉప్పు కలిపి ఆ నీటిని రోగికి తాగించాలి. టేబుల్ సాల్ట్ కాకుండా కళ్ళు ఉప్పు అయితే అందులో పొటాషియం క్లోరైడ్ కొంత ఉంటుంది. ఈ రకంగా మారుమూల గ్రామాలలో కూడా ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ తయారు చేసి రోగికి ఇవ్వవచ్చు.

తయారు చేసే పద్ధతి

సోడియం క్లోరైడ్ (ఉప్పు)	3.5 గ్రాములు
సోడియం బైకార్బొనేట్(సోడా ఉప్పు)	2.5 గ్రా.
పొటాషియం క్లోరైడ్	1.5 గ్రా.
గ్లూకోజ్	20 గ్రా.
పరిశుభ్రమైన నీరు	ఒక లీటరు

ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ రోగికి ఎంతివ్వాలి అనేది రోగి బరువును బట్టి నిర్ణయించాలి. బరువు తెలియనప్పుడు మాత్రమే వయస్సు బట్టి ఇవ్వాలి. రోగి బరువును బట్టి కిలోగ్రాముకి 75 మి.లీ. చొప్పున లెక్కగట్టి ఓ.ఆర్.ఎస్. ఇవ్వాలి.

పోతుంటాయి. డ్రైనేజీ పైపుల్లో మురికినీరు ఎల్లప్పుడు ప్రవహిస్తూ ఉంటుంది.

మంచినీటి పైపుల్లో పరిమిత సమయంలో మాత్రమేనీరు ప్రవహిస్తుంది. మంచినీటి పైపుల్లో నీరు ప్రవహించని సమయాల్లో నెగెటివ్ వత్తిడి కారణంగా డ్రైనేజీ పైపుల్లోని మురికినీరు మంచినీటి పైపుల్లోని లీకులద్వారా ప్రవేశిస్తుంది. తద్వారా రక్షిత మంచినీరు కూడా కలుషితమవుతుంది. మన సామాజిక పరిస్థితుల్లో ఈ ఇబ్బందులను అధిగమించాలంటే కాచి చల్లార్చిననీటిని తాగటం శ్రేయస్కరం. ఫిల్టర్‌లు, ఆక్వాగార్డులు అశేష ప్రజానీకానికి అందుబాటులోకి వచ్చేవి కావు. అదే సందర్భంలో అవి పూర్తిగా నీటిని పరిశుభ్ర పరచకుండా ఇళ్ళల్లో వాడే నీటిలో క్లోరిన్ టాబ్లెట్స్ (500 మి.గ్రా. క్లోరిన్ బిళ్ల 20 లీటర్ల నీటిని పరిశుభ్రం చెయ్యటానికి సరిపోతుంది) వాడవచ్చు. చేతులు శుభ్రంగా కడుక్కోవటం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా ఉండటం మొ॥నవి కూడా అతిసార వ్యాధి నివారణలో తగు పాత్ర వహిస్తాయి.

వర్షాకాలంలో సాధారణంగా అతిసార ఎక్కువగా ప్రబలుతుంది. ఈ సమయంలో ప్రజారోగ్య వ్యవస్థ, పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందుబాటులో ఉండేట్లుగా చూసే బాధ్యతను తీసుకోవాలి. అదే విధంగా స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన సంఘాలు సామాన్య జనాన్ని చైతన్యం చెయ్యటానికి పూనుకోవాలి.

ఏటా పది లక్షల మంది పిల్లలను పొట్టన పెట్టుకుంటున్న అతిసార వ్యాధిని నివారించటానికి ప్రభుత్వపరంగా ఎంత ఖర్చు చేస్తున్నారు? నయంకాని,

ఎంత ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ తాగించాలి

వయస్సు	4 నెలల లోపు	4-11 నెలల వరకు	12-23 నెలల వరకు	2-4 సం॥	5-14 సం॥	15 సం॥ పైన
బరువు (కేజీలలో	5 కె.జి. లోపు	5-7.9	8-10.9	11-15.9 లోపు	16-29.9	30 కేజీల
ఓ.ఆర్.ఎస్. మి.లీ.లో	200-400	400-699	600-800	800-1200	1200-2200	2200-4000

పై పట్టికలో చెప్పిన ప్రకారం మొత్తం ఓ.ఆర్.ఎస్.ను మొదటి 4 గంటలలో నిర్ణయించాలి. ఆ పైన ఎంత ఇవ్వాలనేది రోగి యొక్క పరిస్థితిని బట్టి ఉంటుంది. రోగి ఎంత తాగగలడో అంత ఇవ్వడమనేది సాధారణంగా చేస్తున్నాము. ఓ.ఆర్.ఎస్.తో పాటు ఎన్ని మంచి నీళ్ళు తాగగలిగితే అన్ని మంచినీళ్ళు ఇవ్వాలి.

సెలైన్ ఎప్పుడు ఇవ్వాలి

రోగికి వాంతులు చాలా ఎక్కువగా అవుతున్నప్పుడు, తీవ్రమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు సెలైన్ ఎక్కించాలి.

ఎంత సెలైన్, ఏ ఏ సలైన్ ఇవ్వాలనేది వైద్యుని పర్యవేక్షణలో ఇవ్వాలి.

అతిసార వ్యాధి నివారణకు

ఏ వ్యాధికైనా చికిత్స కంటే నివారణే ఉత్తమం. అతిసార వ్యాధి నివారణలో రక్షిత మంచినీరు కీలక పాత్ర వహిస్తుంది. మన దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో 18 శాతం మంది ప్రజలకు మాత్రమే రక్షిత మంచినీరు 2 కి.మీ. దూరంలో దొరుకుతుంది. పట్టణ ప్రాంతాల్లో 50-60 శాతం వరకు రక్షిత మంచినీరు అందుబాటులో ఉంటుంది. ఈ రక్షిత మంచినీటి సరఫరా వ్యవస్థలోని నీరు కూడా కలుషితమవడం చాలా సందర్భాలలో జరుగుతుంది. మంచినీటి పైపులు, డ్రైనేజి పైపులు పక్కపక్కనే

తక్కువగా వచ్చే జబ్బులను నిర్ధారించడానికి, వాటి చికిత్స చెయ్యటానికి ఎంత ఖర్చు చేస్తుందో? ప్రజలు, ప్రజాప్రతినిధులు తెలుసుకోవడం అవసరం.

ఏటా పది లక్షల మంది పిల్లలను కాపాడటానికి ప్రాధాన్యతను ఇవ్వాలా లేక నయం కాని జబ్బుల వ్యాధి నిర్ధారణకు, చికిత్సకు కోట్లాది రూపాయలు ఖర్చు చెయ్యాలా? మన ప్రభుత్వం రెండో పనే చేస్తుంది. పరిమితమైన వనరులు ఉన్నప్పుడు, వాటిని ఖర్చు చేసేటప్పుడు రక్షిత మంచినీరు సరఫరాకు మన వనరులను వీలైనంత ఎక్కువ కేటాయించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధిలో ప్రజలకు ఆరోగ్యపరమైన చైతన్యాన్ని అందించేందుకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి.

ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కుతానన్నట్లు అత్యంత తేలికగా నివారించదగ్గ అతిసారలాంటి వాటిని నివారించకుండా, గుండె తీసిగుండె పెట్టడానికి, లివర్‌తీసి పెట్టడానికి ప్రయత్నం చెయ్యటం నేలవిడిచి సాము చెయ్యడం లాంటిది. ప్రభుత్వం తన ఆరోగ్య విధానాలలో ఇలాంటి ధోరణులను మార్చుకోనంత కాలం, ప్రజలు చైతన్యవంతమై తమ ఆరోగ్య హక్కును కాపాడుకొనేందుకు ముందుకు రానంతకాలం ఏటా పది లక్షల మంది అతిసార వ్యాధితో మరణిస్తూనే ఉంటారు. ★

'వినికిడి నరం బలహీనపడిన వారికి సదరు వినికిడి నరాన్ని కాక్లియార్‌యింప్లాంట్ ఆపరేషన్ ద్వారా సరిచేయవచ్చు' అని ఆరోగ్య సలహాల్లో రాశారు. అయితే ఈ ఆపరేషన్ మన దేశంలో ఏ ఏ ఆసుపత్రుల్లో చేస్తారు? ఆంధ్రప్రదేశ్, మద్రాస్, కర్నాటక ఆసుపత్రుల అడ్రస్‌లు ఇవ్వగలరు. అలాగే ఎంత ఖర్చు అవుతుందో తెలపగలరు? నా వయస్సు 26, ఎత్తు 5 అడుగులు, బరువు 58 కిలోలు.

-ఎ. పద్మావతి, ఖమ్మం

రాష్ట్రంలో హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో కాక్లియార్ ఇంప్లాంటేషన్ చేస్తున్నారు. డాక్టర్ వినయ్‌కుమార్, ఇఎన్‌టి సర్జన్‌ను అపోలో ఆసుపత్రిలో కలిసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

- డా॥ కొల్లా నాగేశ్వరరావు,

ఎం.ఎస్., డి.ఎల్.ఓ., ఒంగోలు

నాకు గత కొన్ని రోజులుగా తెలియరాని ఏదో భయం, ఆందోళనగా వుంది. నా మూత్రపిండాల్లో నరం గుంజుతున్నట్లుగా, ఏదో గుచ్చుకున్నట్లుగా వుంటుంది. కానీ అంత సీరియస్‌గా లేదు. నా ఆందోళన, అనుమానమే ఇలా కష్టాల్లో పడేస్తుందని నాకు తెలుస్తుంది. కానీ నా అనుమానమే బలంగా వుంది. నాకు ఏమో అవుతున్నట్లుగావుంటుంది. నాకు ఎలాంటి చెడు అలవాట్లు లేవు. టీ బాగా తాగే అలవాటుంది. నా వయస్సు 18 ఏళ్ళు. మూత్రపిండాలకు వచ్చే సమస్యలు తెలుపగలరు. అలాగే ముందు జాగ్రత్తచర్యలు చూపగలరు.

-పి. అరుణ్, సికింద్రాబాద్

మూత్రపిండాలకు చాలా జబ్బులు రావచ్చు. వాటనిన్నింటినీ ఇక్కడ రాయడం నా సమాధానం యొక్క ఉద్దేశం కాదు. అయితే మూత్రపిండాల జబ్బుల వలన కొన్ని లక్షణాలు వస్తాయి. అలాంటి లక్షణాలు ఏమైనా వస్తే మూత్రపిండాల వ్యాధిని గురించి ఆలోచించాలి. యూరిన్ పోసేటప్పుడు విపరీతమైన బాధ కలగటం 2. ఎక్కువ సార్లు యూరిన్‌కు వెళ్లవలసి రావడం. 3. యూరిన్ కొద్దిగా రావడం 4. యూరిన్‌లో రక్తం రావడం 5. ముఖం, కాళ్ళు, పొట్ట వాయడం 6. పక్కటెముకల కింది నుండి గజ్జల్లోకి మెలిపెట్టినట్లు నొప్పి రావడం మొదలైన లక్షణాలు మూత్ర పిండాల వ్యాధులను సూచిస్తాయి. పై లక్షణాలేవీ రాకపోతే మీరు ఆందోళన చెందవలసిన అవసరం లేదు.

- డా॥ పి.అజయ్‌కుమార్

డా॥ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు

అంపశయ్య నవీన్

సాహిత్య సమావేశాలు



"నిన్న సాయంత్రమంతా మీరు ఇంట్లో ఉన్నట్టు లేదు. ఎక్కడకెళ్ళారు?" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"నిన్న సాయంత్రం ఇక్కడి అశోకా హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఓ సాహిత్య సమావేశానికెళ్ళాను.." అన్నాను.

"మీరింటికొచ్చేటప్పటికి చాలా ఆలస్యమైనట్టుంది?"

"అవును... సాయంత్రం ఆరింటికి ప్రారంభమైన సమావేశం రాత్రి పదింటిగ్గానీ పూర్తి కాలేదు...."

"అంటే నాలుగ్గంటల సేపు మీరా సమావేశంలో కూర్చుండిపోయారన్నమాట! మీకెంత ఓపికండి! నాకైతే యే సమావేశంలోనన్నా సరె ఓ అరగంట సేపుంటే చాలు, వెళ్ళిపోదామనిపిస్తుంది. మీరు కెళ్ళిన సాహిత్య సమావేశానికి జనం బాగా వచ్చారా? నాకు ఆశ్చర్యం కల్గించే విషయమేమిటంటే ఈ రోజుల్లో సాహిత్యాన్నెవరూ చదవడం లేదంటున్నారు. కానీ సాహిత్య సమావేశాలు మాత్రం తరచుగా జరుగుతున్నాయి. మనూర్లోనే నెలకు రెండో మూడో సాహిత్య సమావేశాలు జరుగుతున్నాయని మీరే ఓసారి చెప్పారు... అసలీ సాహిత్య సమావేశాల వల్ల ప్రయోజనమేమన్నా ఉంటుందంటారా" అన్నాడు పుల్లారావు.

"సాహిత్యాన్ని చదివే పాఠకులు తగ్గిపోతున్నారు కాబట్టే సాహిత్య సమావేశాల్ని ఎక్కువగా జరపాల్సిన అవసరం ఏర్పడుతున్నది - ఈ సమావేశాల ద్వారానన్నా కొందరిలోనన్నా ఓ మంచి పుస్తకాన్ని చదవాలన్న కోరికను కల్గించాలి. ఈనాటి యువతరానికి అసలు సాహిత్యమంటే ఏమిటో తెలియకుండా పోతున్నది. ఓ మంచి నవలంటే ఏమిటి? ఓ మంచి కథంటే ఏమిటి? అది చదవడం వల్ల కలిగే ప్రయోజనమేమిటి? మొదలైన విషయాల్ని ఇలాంటి సాహిత్య సమావేశాల ద్వారా యువతరానికి చెప్పాలి. నిన్న జరిగిన సమావేశంలో ఓ ప్రఖ్యాత రచయిత ప్రసంగిస్తూ ఓ గొప్పమాటన్నాడు. అదేమిటంటే అర్థంకాని జీవితాన్ని.. అంటే అత్యంత సంక్లిష్టమైన మానవ జీవితాన్ని అర్థం చేయించే వాడే రచయిత" అని. ఓ వ్యక్తి తనను గూర్చి తాను తెలుసుకోవాలన్నా, సమాజాన్ని గూర్చి తెలుసుకోవాలన్నా మంచి నవలలూ, మంచి కథలూ, మంచి కవితలు చదవడం ద్వారానే సాధ్యమవుతుంది - సాహిత్యానికి దూరమైపోతున్నంత కాలం సమాజంలో ఉన్నతమానవత్వపు విలువల స్థాపన జరగదు"

"చెప్పిందంతా బాగానే ఉంది. కానీ నాకో విషయం చెప్పండి - ఈ సాహిత్య సమావేశాలకు జనం వస్తున్నారా? ముఖ్యంగా మీరన్న ఆ యువతరానికి చెందిన వాళ్ళెవరన్నా వస్తున్నారా?"

"సాహిత్య సమావేశాలకు ఎక్కువ మంది రావడం లేదన్న మాటలో కొంత నిజముండొచ్చు. ఏ సమావేశాలకైనా - రాజకీయ సమావేశం కావచ్చు, ఉద్యోగస్తుల యూనియన్లకు సంబంధించిన సమావేశం కావొచ్చు... మరేదన్నా కావొచ్చు.. ఆ సమావేశాలకు ఎంతమంది జనం వచ్చారన్నది ఆ సమావేశాలను ఆర్గనైజ్ చేసిన వాళ్ళ మీద ఆధారపడుంటుంది - సమావేశాలకు పిలవగానే, ఓ ఆహ్వాన కాగితాన్ని పంపించగానే వచ్చే వాళ్ళు తక్కువగానే ఉంటారు - మొదలు పంపించవలసిన వాళ్ళందరికీ ఆహ్వానాలు అందేలా చూడటం... ఆ తర్వాత ఫోన్లు చెయ్యడం, ఎక్కడ కలిస్తే అక్కడ రావాలని చెప్పడం ఇట్లా సాధ్యమైనంత ఎక్కువ మందిని - ముఖ్యంగా సాహిత్యం మీద ఏ కొంచెం అభిరుచి ఉన్న వాళ్ళను కూడా వదిలిపెట్టకుండా - ఆహ్వానించగలిగితే కనీసం ఆ సమావేశం జరుగుతున్న హాల్ నిండేంత మందన్నా వస్తారు... కనీసం ఓ వంద మందొచ్చినా ఆ సమావేశం బాగా జరిగినట్టేనని చెప్పొచ్చు. ఈ వందమందిలో కనీసం ఓ ఇరవై, ముప్పైమందన్నా యువతరానికి చెందిన వాళ్ళుంటారు. వీళ్ళల్లో కొందరైనా సాహిత్యాన్ని గూర్చి, సాహిత్య ప్రయోజనాన్ని గూర్చి తెలుసుకుంటే ఆ సాహిత్య సమావేశం యొక్క ప్రయోజనం నెరవేరినట్టే."

"నాది మరో సందేహం.. ఈ సమావేశాలకొచ్చే వాళ్ళు నిజంగా సాహిత్యాన్ని గూర్చి తెలుసుకోవడానికో, సాహిత్యం మీది అభిమానంతోటో వస్తున్న వాళ్ళేనంటారా?"

"ఈ సమావేశాలకొచ్చే వాళ్ళల్లో రకరకాల వాళ్ళుంటారు. నిజంగా సాహిత్యంమీది అభిమానంతోటే వచ్చే వాళ్లు కొందరు తప్పకుండా ఉంటారు. ఆ సమావేశాల్లో మాట్లాడే వక్తల మీదున్న అభిమానంతో కొందరొస్తారు - పదిసార్లు చెప్పారు గదా, వెళ్ళకపోతే బావుండదని అలా వచ్చి ముఖం చూపించి వెళ్ళిపోయే వాళ్ళు కొందరుంటారు - ఈ సమావేశాలకొస్తే ఎప్పుడూ కలవని వాళ్ళు కొందరు కలుస్తారు.... వాళ్ళతో కాస్సేపు కబుర్లు చెప్పుకోవచ్చునని కొందరొస్తారు - కొందరేమో ఈ సమావేశం ఎలా జరిగింది? అట్టర్‌ఫ్లాపా? లేక మోడరేట్ సక్సెసా? తెలుసుకొని ఆ సమావేశానికి రాని వాళ్ళతో "ఆ సమావేశం అట్టర్‌ఫ్లాప్" అని చెప్పి సంతోషించడానికొస్తారు. ఇంకా కొందరేమో సమావేశం జరుగుతున్న వరండాలో తిరుగుతూ వచ్చీపోయేవాళ్ళను చూస్తూ, ఫ్రెండ్స్‌తో కబుర్లు చెప్పుకొని వెళ్ళిపోతారు - కొందరేమో సమావేశంలో కూర్చొని కూడా వక్తలు మాట్లాడే మాటల్లో ఒక్కమాట కూడా వినకుండా పక్కనున్న వాడ్ని కూడా విననీయకుండా కూర్చున్నంత సేపు పక్కవాళ్ళతో మాట్లాడుతూనే ఉంటారు. అన్నీ మాకే తెలుసు, ఒకరు చెబితే వినడం మన తాహతుకు తగిన పని కాదు అనుకునే వాళ్ళే ఇలా సభలో ఎప్పుడూ మాట్లాడుతుంటారు. మరో విషయమేమిటంటే సభ ప్రారంభంలో ఉన్నంత మంది సభ చివరి దాకా ఉండరు - సగమైపోయేటప్పటికే సగం మంది వెళ్ళిపోతుంటారు - ఇక ఈ సభకొచ్చే పాత్రికేయుల విషయం కూడా కొంచెం చెప్పాలి. మన పత్రికల వాళ్ళు రాజకీయ సమావేశాలకిచ్చినంత ప్రాధాన్యత సాహిత్య సమావేశాలకివ్వరు మరో విషయమేమిటంటే ఇప్పుడన్నీ జిల్లా ఎడిషన్స్ వచ్చాయిగదా.. సాహిత్య సమావేశాల వార్తల్ని జిల్లా పేజీల్లో మాత్రమే వేస్తున్నారు. ఇది చాలా అన్యాయంగా కనిపిస్తుంది నాకు. ఎందుకంటే సాహిత్యమనేది విశ్వవ్యాప్తమైనటువంటి ది - తెలుగు సాహిత్యానికి సంబంధించిన వార్తలు కనీసం రాష్ట్రంలో ఉన్న తెలుగు వాళ్ళందరికీ తెలియాలి. చంద్రబాబు నాయుడు ఏమన్నాడో ఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలియడం ఎంతముఖ్యమో, ఓ కాళోజీ, ఓ సి.నారాయణరెడ్డో, ఓ దాశరథో, ఓ వాసిరెడ్డి సీతాదేవో ఏమన్నారో తెలీడం కూడా అంతే ముఖ్యం".

"ఈ సాహిత్య సమావేశాల వల్ల జరుగుతున్న ప్రయోజనమేమిటో మీరు చెప్పనే లేదు."

"సాహిత్యం మీద ప్రజలకు ఆసక్తి కలిగించడమే అంటే సాహిత్య సమావేశాలకొచ్చిన పది మందినన్నా మంచి పుస్తకాల్ని చదవాలన్న అభినివేశాన్ని కల్గించడమే సాహిత్య సమావేశాల లక్ష్యమయిఉండాలి. ఉదాహరణకి ఓ రచయిత రాసిన పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగిందనుకోండి - ఆ పుస్తకం వచ్చినట్టు పది మందికి తెలుస్తుంది. వక్తలు ఆ పుస్తకాల్ని పరిచయం చేస్తారు కాబట్టి ఆ పుస్తకాల్లో ఏముందో తెలుస్తుంది. అలా కొంతమందైనా ఆ పుస్తకాల్ని కొనుక్కొని చదువుతారు. నిన్న నేను వెళ్ళింది పుస్తకావిష్కరణ సభకే నిన్న ఆవిష్కరించబడిన పుస్తకాన్ని సభకొచ్చిన ఓ ఇరవై మంది దాకా కొనుక్కున్నారు. డబ్బు పెట్టి కొనుక్కున్నారు కాబట్టి వాళ్ళా పుస్తకాల్ని తప్పక చదువుతారు - కాబట్టి ఈ సమావేశం మంచి పుస్తకాల్ని ప్రజల చేత చదివించాలన్న లక్ష్యాన్ని నెరవేర్చినట్టే కదా" అన్నాన్నేను.

"అవునా" అంటూ పుల్లారావు లేచివెళ్ళిపోయాడు. ★

చిన్నారి చిత్రకారులు

ఎస్. దేవేందర్, 10వ తరగతి
ట్వింకిల్‌స్టార్ హైస్కూల్,
మహబూబాబాద్, వరంగల్ జిల్లా

టి. అరుణ్, 7వ తరగతి
ఠాగూర్ విద్యాలయం, వైరా



డి. హిమకర్, 9వ తరగతి
ప్రగతి విద్యానికేతన్, కంభం, ప్రకాశం జిల్లా



శ్రేయ, హర్షిత,
మంగళూరు

కలంస్నేహం

పేరు : ముత్యాల మాధురి
వయస్సు : 13
చదువు : 8వ తరగతి
హాబీలు : ముగ్గులు వేయడం, పుస్తకాలు చదవడం, కలంస్నేహం
పూర్తి చిరునామా : డాటరాఫ్ ముత్యాల రామారావు, ఇ.నెం : 7-8-34/35, పోచమ్మగుడి వద్ద, న్యూగొల్లగూడెం, కొత్తగూడెం, ఖమ్మం జిల్లా

పేరు : జాకారం కృష్ణ
వయస్సు : 14
చదువు : 9...
హాబీలు : పుస్తకాలు, పేపర్ చదవడం, కవితలు రాయడం
పూర్తి చిరునామా : సన్నాఫ్ జాకారం సాయిలు, గ్రామం : మీర్జాపూర్, మండలం : భీర్కూర్, జిల్లా : నిజామాబాద్

పేరు : పలుస ప్రియాంక
వయస్సు : 15
చదువు : 10వ తరగతి
హాబీలు : క్యారమ్స్ ఆడటం, టీవీ చూడటం, పాటలు పాడటం, బుక్స్ చదవడం
పూర్తి చిరునామా : కేరాఫ్ ఆర్ఎన్ఎన్ స్టడీసర్కిల్, బండారునగర్, తాలుకా : వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా-509103

ఆహ్వానం

ప్రజాశక్తి 'హ్యాపీ బర్త్‌డే'

విభిన్న శీర్షికలతో పాఠకుల అభిమానం చూరగొంటున్న 'ప్రజాశక్తి' మీ చిన్నారులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేయాలనుకుంటోంది. ఐదేళ్ల వయస్సు వరకు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టినరోజుకు నెల రోజుల ముందుగా వివరాలు పంపడమే. **మీ చిన్నారి పేరు, వయస్సు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, ఊరిపేరు తదితర వివరాలతో ఓ కలర్‌ఫొటో జతచేసి పంపాలి.** మీ చిన్నారి పుట్టినరోజు ఉన్న వారంలో వెలవడే ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో ఫొటో, వివరాలు ప్రచురించడం జరుగుతుంది. మీకు ఎంతో ఆనందం కలిగించే మీ ఇంటి దీపాల పుట్టిన రోజు వేడుకలను ప్రజాశక్తి అభినందనలతో జరుపుకోండి.

ఇట్లు
ఎడిటర్

పంపవలసిన చిరునామా : హ్యాపీబర్త్‌డే, కేరాఫ్ సండే సెక్షన్, ప్రజాశక్తి కార్యాలయం, స్ట్రీట్ నెం : 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20 ఫోన్ : 7673787, 7665420

చప్పు - జనమభూమి - చప్పు

రుక్మిణి



"గొడ్ల డాక్టరు మా పూర్లెకసలు రావటం లేదు. గొడ్లేమో మేతలేక సచ్చిపోతున్నాయి. మరి మేకలన్నింటిని సంపి పారెయ్యమంటే..."

యాకయ్య యింకా కోళ్ళూ.. కుక్కల సంగతి ఎత్తుకోబోయేసరికి, పందుల గురివిగాడు మండిపోతూ గుర్రుగా చూస్తూ నుంచున్నాడు. మధ్యలోనే చెంద్రబాబుగారు మండిపడుతూ "సర్లెరె.. ఈ వూరింక బాగుపడదు. ఊరికి పశువుల డాక్టరు ముఖ్యం – వెంటనే అతణ్ని డిస్మిస్ చేసి పారేస్తున్నాను."

అక్కడ జనమభూమిలో పోగైన పిల్లా జెల్లా జనం కేరింతలు కొట్టారు.

"మండలంలో యమ్మార్వో అసలు దొరకడంలేదు. యాడ్నించి వస్తడో యాడికి బోతడో అంతుబట్టడం లేదు.."

చెంద్రబాబు మళ్ళా మండి పడ్డాడు. "అధికార్లు నామాటా.. మీ మాటా వింటంలేదు. వీళ్ళని నిలదీయండి. పని చేయని వాళ్ళని వదిలేది లేదు. వాళ్ళని నిద్రపోనివ్వను. నేను నిద్రపోను. ఏమయ్యా మండల కేంద్రంలో వుండకుండా ఊర్లు పట్టుకు తిరగడమేనా నీ పని" యమ్మార్వో చెమట్లు తుడుచుకున్నాడు. 'యమ్మార్వోను సస్పెండు చేస్తున్నాను.. అంతా ఎలక్ట్రానిక్ గవర్నెస్.. సర్వీసు..'

ఈ ఊర్లో రైతులకే తిండిలేదు. మేతలేకేమో పశువుల్ని అయినకాడికి రైతులు అమ్మేసుకుని చావులకు తెగబడుతున్నారు. తనెవరికి వైద్యం చేయాలె! మనుషులకా?

"డాక్టరమ్మ ఆసుపత్రికి రావడం లేదు. కొత్తగా పెండ్లి చేసుకుని షికార్లు పోతుంది!" ముత్తమ్మ అసహనంగా అంది.

"లాభంలేదు. ఈ రాష్ట్రాభివృద్ధి వీళ్ళకేమాత్రం పట్టదు. విధులు సక్రమంగా నిర్వహించడం లేదు. ఎవర్నీ వదిలే ప్రసక్తిలేదు. డాక్టరమ్మ వెంటనే 'లాంగ్‌లీవ్'లో వెళ్ళిపోవాలి!"

డాక్టరమ్మ నీరసంగా కూలబడి పోయింది.. అసలామె అసలే రెండు నెలల్నుండీ సెలవులో వుందాయె!

"మా స్కూలు పంతులుగార్లు టయానికి బడికి రాటంలేదు. పోరగాండ్లకు చదువు సరిగా చెప్పడం లేదు. ఏడో తరగతిలో ఒక్కడూ పాసు కావటంలేదు!"

"ఏమయ్యా, నువ్వేనా హెడ్మాస్టరివి! ఏం చేస్తున్నావ్!" చెంద్రబాబు నిప్పులు చెరగడానికి అన్నీ తయారు చేసుకుంటున్నాడు... మాట్లాడవేం – ప్రజలడిగిన దానికి నీ సమాధానం? హరికథలు చెప్పొద్దు!" హుంకరించాడు.

"చదువు సరిగా చెప్పడానికి అసలు పిల్లలు బడికి వస్తేగద సార్! ఎన్ని సార్లు వెంటబడ్డా... కూలికనీ.. పాలేరు పనికనీ... వాడికాళ్ళ మీద వాడే నిలబడతాననీ.. గొడ్లనీ.."

చెంద్రబాబు ఎడాపెడా నిప్పులు చెరిగి పారేశాడు. "నేను అడిగిందేమిటి.. నువు చెబుతున్నదేంటి? బుద్ధిగా హెడ్ క్వార్టరులో వుండి బడి నడిపించాలని తెలీదా?" అటూ ఇటూ నిప్పులు చెరుగుతుండడంతో జనాలు బాగా భయంగా దూరంగా జరిగిపోయారు. ప్ర. ఉపాధ్యాయుడు మాత్రం చెక్కు చెదరకుండా చిరునవ్వుతో నిలబడ్డాడు.

"బడిలో మూడు పోస్టులు ఖాళీ.. పట్టించుకున్న ప్రభువే లేదు. కాగితం ముక్కలూ.. చాక్ పీసులూ... పదేండ్లనుండీ ఇవ్వడం లేదు..."

చెంద్రబాబు పూర్తిగా మండిపోయి – "ప్రభుత్వం మీ జీతాలకోనం వేలకోట్లు.. బడ్జెట్‌లో 90% ఖర్చు పెడుతుంది. మాటలనవసరం! వెంటనే నిన్ను డిస్మిస్ చేసి పారేస్తున్నాను. అక్షర సంక్రాంతీ... అక్షర క్రిస్మస్ స్ఫూర్తి తెచ్చుకుని 'అక్షర ఆంధ్ర' చేయాలని తెలియజేసుకుంటున్నాను."

కాస్త అసంటా అరుగుమీద కూర్చున్న యాద్గిరీ, మల్లేశుకు మతులు పోయినంత పనయ్యింది. మొత్తానికి సి.యం. గారు అవినీతి ఉద్యోగుల భరతం బాగా పడుతున్నాడు. అంతే కావాలి! వేలకు వేలు జీతాలు దొబ్బుతూ 'డ్యూటీ'లు సరిగా చేయకపోతే మరి స్వర్ణాంధ్రను సాధించేదెట్లా? అంతే కావాలి. యాద్గిరికి హుషారుపుట్టి ఒక ఈల వేద్దామని చుట్టూ నేలబారు తీరిన పోలీసులూ.. తుపాకులూ చూసి బలవంతాన నిగ్గబట్టుకున్నాడు.

"ఆదరణ పథకం.. అన్నపూర్ణ బియ్యం.. అమలు చేయడంలో అధికార్లు విఫలమైపోతున్నారు. అందుకే స్వర్ణాంధ్రను సాధించలేకపోతున్నాం. ఏమయ్యా, వృత్తిదారుగా నీకెన్ని సైకిళ్ళు ముట్టాయి."

"కల్లుగీత నా పని.. నేను సైకిలేజేసుకోను – సైకిలేసుకుని తాటిచెట్లెగ బాకుదామంటే – ఆసాములు పట్టేదార్లు వాండ్ల జాగాల్లోకి రానీటం లేదాయె!"

"ఆసాముల మీద చర్యలు తీసుకోని రెవిన్యూ అధికార్లందరినీ సస్పెండు చేస్తున్నాను. ఇంకా ఏంటి...ఏమమ్మా.. నువు అంగన్‌వాడీ టీచరమ్మవా.. ఊళ్ళోనే వుంటున్నావా.. ప్రజలారా.. ఈ అంగన్‌వాడీ మీ ఊర్లోనే నివాసం వుంటుందా?"

యాద్గిరి కడుపుబ్బరం పట్టలేక బిగ్గరగా ఈలేసి – భయం భయంగా పోలీసులకేసి చూశాడు. జనాలు 'వుండటంలేదు.. అసలుండడంలేదు' అని పెడబొబ్బలకు తగులుకున్నారు.

"విధి నిర్వహణ సరిగా చెయ్యరు. జీతాలు పెరగాలని అల్లరి చేయడం తెలుసు! వెంటనే ఈమెను డిస్మిస్ చేస్తున్నాను."

జనాలు భీకరంగా చప్పట్లు కొట్టారు.

"సార్.. సార్.. నేను వస్తేసేది ఈ ఊరుకాదు. పక్క పూర్లో నా పోస్టింగు.. మీ సభ చూడడానికి.. మీరు చెప్పే మాటలు వింటానికీ వచ్చాను!"

చంద్రబాబు రెండుసార్లు మండిపడ్డాడు. "నువ్వు చాలా తెలివిగా మాట్లాడుతున్నావ్. ఈ ఆరేడు సంవత్సరాలనుండీ .. రేడియోలో... టి.వి.లో హెలికాప్టరెక్కి ఊరూరా సభల్లో మాటలు చెప్పడవే నా పనాయె! ఈ ప్రచారానికే రెండుమూడు వందల కోట్లు.. మళ్ళా నువు కొత్తగా విందానికేముంది? వెళ్ళు.. నిన్ను 'డిస్మిస్' చేసేశాను."

అప్పటికి ఆ మండల, మరి ఇతర గ్రామాల చిన్నాచితకా సస్పెండయిన ఉద్యోగుల సంఖ్య బారెడు చాంతాడంతయ్యింది.

"హమ్మయ్య.. ఇక ఈ ఉద్యోగుల బెడద తప్పిపోయింది. వీళ్ళవల్లనే మన స్వర్ణాంధ్ర సాధించుకోలేకపోతున్నాం. మీ పనులు మీరే చేసుకోవడానికే ఇ – గవర్నెస్ – ఇంటింటికీ ఇంటర్నెట్ పెడుతున్నాం! మీ కాళ్ళమీద మీరు నిలబడాలె. మొన్న టోనీ బ్లెయిర్ గారు ఈ విషయంలో మరింత సాయం చెయ్యడానికి మనూరొచ్చారు. మరో 80వేల మంది ఉద్యోగులను వూడబీకితేనే గానీ వల్లకాదన్నాడు. ఈ ప్రభుత్వరంగ పరిశ్రమలను మూసిపారేయకపోతే మరింక మీరు ముందుకే కాదు. వెనక్కి కూడా పోనే పోలేరన్నాడు. ఏవమ్మా ముసిలమ్మా.. ఏంటి.. ఏం కావాలి.. మీ ఆడాళ్ళందరికీ చైతన్యం వచ్చేసింది. ఏం భయంలేదు. నీకేం కావాల్నో ధైర్యంగా అడిగెయ్!"

"మాకు స్వర్ణాంధ్ర కావాలె! దేశంలోని జనమందరికీ తింటానికి తిండీ – మంచినీళ్ళు కావాలె – పంట పొలాలకు నీళ్ళు కావాలె! వుండానికి గుడిసెకావాలె!"

"అందుకే గదమ్మా.. నేను రోజుకు 18 గంటలు పనీ.. ఓ రెండు గంటలు యోగాసనాలు వేస్తున్నదీ... ఇంకా ఏం చేయమంటావో చెప్పు.. చెప్పు..!"

"ఏం లేదు బాబుగారూ – మీరుగానీ ఈ రాష్ట్రంనుండి అధికారం నుండి తప్పుకుని.. రెం గంటలు కాదు.. ఏడెనిమిది గంటలు యోగాసనాల్లో శీర్షాసనాలో వేసుకుంటూంటే మా రాష్ట్రం బా బాగుపడిపోద్ది... గంతే.. గంతే!"

సిమెంటు చప్టామీద యాద్గిరి నోరు తెం వెనక్కి విరుచుకు పడిపోయాడు.

క్రీడల పట్ల పెరుగుతున్న క్రేజ్

క్రీడల్లో పాల్గొనడం కొంతమందికే పరిమితం అని గతంలో భావించేవారు. కానీ ప్రస్తుతం క్రీడలు తమ జీవితంలో ఒక భాగంగా ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. తమ కెరీర్‌లో అభివృద్ధి కొరకు క్రీడలు కూడా ఒక సాధనమే అని అనుకుంటున్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల సహకారంతో తాము ఎంచుకున్న క్రీడలో ప్రావీణ్యత సాధించడానికి విశేషంగా కృషి చేస్తున్నారు. దీంతో క్రీడాకారుల్లో కూడా పోటీతత్వం పెరిగిపోయింది.

హసన్ షరీఫ్

నగరంలో ఇటీవల చలి పెరిగిపోవడంతో నగరవాసులంతా దుప్పటికప్పుకొని బారెడు పొద్దెక్కే వరకూ నిద్రపోతూ ఉన్నారు. కానీ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న అభినవ్ కుమార్ ఉదయమే లేచి తాను శిక్షణ పొందుతున్న క్రికెట్ కోచింగ్ అకాడమీకి వెళ్తాడు. చిన్నవయస్సులోనే స్టార్ వికెట్‌కీపర్-బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందిన అభినవ్ ప్రాక్టీసుకు ఎప్పుడూ ఆలస్యంగా వచ్చిఎరుగడు. ఆలస్యంగా వస్తే శిక్షతప్పదని అతనికి తెలుసు. గత 12 సంవత్సరాలుగా క్రికెట్ ఆడుతున్న అభినవ్ 1999లో అంతర్జాతీయ పోటీల్లో భారత్ అండర్-15 జట్టు తరఫున రెండుసార్లు (ఆసియాకప్, ప్రపంచకప్‌లలో) ప్రాతినిధ్యం వహించాడు.

అభినవ్ ఒక్కడే కాదు... స్వేత, దయాన, మేరి, రూపికతో పాటు చాలామంది పిల్లలు క్రీడలను తమ జీవితంలో ఒక భాగంగా ఎంచుకున్నారు. వారి తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. ప్రతిభగల తమ బాలబాలికలు క్రీడల పట్ల అంకితభావాన్ని కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి అవసరమైన సదుపాయాలను తల్లిదండ్రులే సమకూర్చడానికి ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ప్రముఖ బాస్కెట్‌బాల్ కోచ్ రవీందర్ బాబా, క్రికెట్ కోచ్ జాన్ మనోజ్ చెప్తున్న దాన్ని బట్టి ఇది నిజమేనని తెలుస్తోంది.

"దేశ ప్రజల్లో స్పష్టమైన మార్పు వచ్చినప్పటికీ క్రీడల్లో దేశ భవిష్యత్తు ఇంకా నిరాశా జనకంగానే ఉంది. గతంలో తల్లిదండ్రులు తమ పిల్లలు ఆటల్లో పాల్గొంటే చదువులో వెనకబడి ఎందుకూ పనికిరానివారవుతారని భావించేవారు. అయితే తమ పిల్లలు క్రీడల్లో రాణిస్తేనే వారి భవిష్యత్తు మెరుగవుతుందని భావించే తల్లిదండ్రుల సంఖ్య నిదానంగా పెరుగుతోంది. ప్రతిభగల క్రీడాకారులు స్పాన్సర్ల కొరత వల్ల తెరచాటునే ఉంటున్న విషయం తెలిసిందే. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. ప్రతిభ గల యువకులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉద్యోగావకాశాలు కల్పించి ప్రోత్సహిస్తోంది. సత్యం కంప్యూటర్స్, హెచ్.పి. గ్యాస్ మొదలైన సంస్థలు క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు కల్పించి ప్రోత్సహిస్తున్నాయి" అని బాబా అన్నారు. దీపిక బాస్కెట్‌బాల్ నేర్చుకునేట్టు ఆమె తండ్రి సైలమ్ యాదవ్ ప్రోత్సహించాడు. "బాస్కెట్‌బాల్ ఆడాలనుకుంటే నా ప్రోత్సాహం పూర్తిగా ఉంటుందని మా డాడీ అన్నాడు. నేను జాతీయ స్థాయిలో రాణించగలిగితే మా కుటుంబ సభ్యులు ఎంతో సంతోషిస్తారు" అని దీపిక తెలిపింది. ఇగ్నేషియస్ మైఖేల్‌ను అతని తండ్రి విన్సెంట్ స్నేహితుడి మాదిరిగా ప్రోత్సహిస్తాడు. మైఖేల్ కూడా బాస్కెట్‌బాల్‌లో ప్రావీణ్యం సంపాదించడానికి కృషి చేస్తున్నాడు. "నీ జీవితాన్ని నీ ఇష్టమొచ్చినట్లు మరల్చుకో. నీవు బాస్కెట్‌బాల్‌నే హృదయపూర్వకంగా ఇష్టపడి అందులోనే భవిష్యత్తును వెతుక్కుంటానంటే నేను అభ్యంతర పెట్టను. సాధ్యమైనంత ప్రోత్సాహాన్ని ఇస్తాను" అని తన తండ్రి ఎప్పుడూ చెప్తూ ఉంటాడని మైఖేల్ అన్నాడు.

పిల్లలు ఏ క్రీడలో రాణిస్తారో, వారికి క్రీడల్లో మంచి భవిష్యత్తు ఉందోలేదో అనే విషయాన్ని వారి తల్లిదండ్రులకు అప్పుడప్పుడు కోచ్‌లు కూడా చెప్తూ ఉంటారు. పిల్లలు కనబరుస్తున్న ప్రతిభను వారి తల్లిదండ్రులకు కోచ్‌లు తెలియజేసి ఈ క్రీడలో కొనసాగనిస్తే వారి భవిష్యత్తు బాగుంటుందని నచ్చజెప్తూ ఉంటారు.

క్రీడల్లో కుళ్ళు రాజకీయాల పట్ల అసంతృప్తి

"క్రికెట్‌లో వేళ్ళూనుకున్న రాజకీయాల వల్ల క్రికెట్‌లో నా భవిష్యత్తు పట్ల నా తండ్రి కలవరం చెందుతూ ఉంటాడు" అని మరో క్రికెట్ ప్రేమికుడు అనూప్ తెలిపాడు. క్రికెట్ ఇటీవల డబ్బులు ఉత్పత్తి చేసే సాధనంగా మారిందని కోచ్ జాన్ మనోజ్ చెప్పాడు. అందుకే అంతర్జాతీయ మ్యాచ్‌లలో స్థానం సంపాదించడానికి చాలామంది చెడు మార్గాలను కూడా అవలంబిస్తూ ఉన్నారు. "ప్రతిభగల యువ క్రికెటర్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే వేలాది మంది ఈ క్రీడను నేర్చుకోవడానికి ఆసక్తి కనబరు స్తారు. చాలా మంది బాలబాలి కలకు క్రికెట్ నేర్చు కోవాలని ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక సమస్యలు, భవిష్యత్తుపై గల భయం వల్ల ముందుకు రాలేక పోతున్నారు" అనే అభిప్రాయాన్ని మనోజ్ వ్యక్తం చేశాడు.

అయితే ఇప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలే ఏకైక లక్ష్యంగా అభివృద్ధి చేయడానికి ఇష్టపడడంలేదు. "క్రికెట్‌ను మినహా ఇతర క్రీడలను స్పాన్సర్ చేయడానికి ఎవరూ ముందుకురావడం లేదు. ప్రస్తుతం క్రీడా ప్రపంచం ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహిం చడానికి బదులు కుళ్ళు రాజకీయాలకు వేదికగా మారింది. ప్రస్తుతం ఉత్తమ క్రీడాకారులుగా పేరు తెచ్చుకున్న వారు ఈ కుళ్ళు రాజకీయాలను ఎలా తప్పించుకున్నామో వివరిస్తూ ఉంటే బాధేస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్న క్రీడాకారులను కూడా రాజకీయాలకు బలిచేసి తెరమరుగు చేస్తున్న వార్తలు పత్రికల్లో రోజూ చూస్తూనే ఉన్నాం. అందుకే క్రీడలే సర్వస్వంగా భావించకూడదని మా పిల్లలకు సూచిస్తూ ఉంటాను. క్రీడలతో పాటు చదువుపట్ల కూడా ఆసక్తి కనబర్చాలని సూచిస్తూ ఉంటాను" అని ప్రదీప్ గేరా అన్నాడు. మాజీ సైనికాధికారి అయిన ప్రదీప్ తన ఇద్దరు పిల్లలకు బాక్సింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాడు. అయితే సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలి, విశ్వనాథన్ ఆనంద్, కరణం మల్లేశ్వరి, పి.టి.ఉష మొదలైన ప్రముఖ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకొని చాలామంది తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహి స్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రానికి చెందిన పుల్లెల గోపీచంద్, వి.వి.ఎస్.లక్ష్మణ్, పెంట్యాల హరికృష్ణ, కోనేరు హంపి మొదలైనవారు చిన్నప్పటి నుండి తమ క్రీడల్లో రాణించడానికి అనుసరించిన మార్గాలు, చేసిన కృషిని తెలుసుకొని తమ పిల్లలు కూడా అదేవిధంగా కృషి చేసి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని చాలామంది ఆశిస్తున్నారు. ★

ఈ ప్రాక్టీసే భవిష్యత్తుకు బంగారు బాట

మెరుపువీరుడు మేదరమెట్ల

రామకృష్ణ

జైలు సెంట్రీ నుండి ఆయుధాలు స్వాధీనం... రాయనిపాలెం గస్తీ మిలటరీపై దాడి... అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌పై దాడి... పుల్లల చెరువు స్టేషన్ నుండి రైఫిళ్ళు స్వాధీనం... ఏలంపేట స్టేషన్‌పై మెరుపు దాడి... పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్ నుండి 15 తుపాకులు స్వాధీనం... గడివేముల పోలీస్‌స్టేషన్‌పై దాడి... సుబ్బారెడ్డి గూడెంలో మిలటరీతో సెల్యూట్ కొట్టించుకున్న సాహసం... ఎన్నెన్ని సాహసాలు... లెక్కలేనన్ని వీరోచిత కృత్యాలు...

వీధిబడిలో ఇసుకలో అక్షరాలు దిద్ది, ప్రాథమిక విద్యతోనే చదువు ముగించి, సాగుకు యోగ్యంకాని పొలంవల్ల ఆర్థికంగా చితికిపోయిన దశలో బతుకుతెరువుకోసం పశువుల కాపరైన ఓ సామాన్య యువకుడు... తెలంగాణాలో నైజాం, జాగీర్దార్ల, దొరల పీడనకూ, దోపిడీకి గురవుతున్న రైతుల విముక్తికై సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో తుపాకీ పట్టి... పైన పేర్కొన్న వీరోచిత ఘటనలకు నేతృత్వం వహించగలగడం అరుదైన విషయమేగాక ఎంతో ఉత్తేజమూ కల్గిస్తుంది. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని అణచివేయడానికి సిద్ధమైన అధునాతన ఆయుధాలూ, మిలటరీ శిక్షణ కలిగి ఉన్న సైన్యంతో గెరిల్లా యుద్ధ పద్ధతులలో (మాటుగాసి తనకంటే బలమైన శత్రువును దెబ్బతీయడం) జరిగిన పోరాటంలో పాల్గొన్న ఆ సాహసి పేరే మేదరమెట్ల సీతారామయ్య.

1949వ సంవత్సరం ఆగస్టు నెల...

నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ - కోదాడ మెయిన్‌రోడ్డు అది.

అక్కడ బోయినపల్లి వెంకటరామారావు అనే లాయరు ఇల్లు ఉంది.

ఆ ఇంట్లో పోలీసు అధికారులు, వివిధ గ్రామాలకు చెందిన 'దొర'లు, పెద్ద ఉద్యోగులు, గ్రామ పెద్దలు రోజూ అక్కడ చీట్లపేక ఆడుతుంటారు.

ఈ ప్రాంతంలో డిఎస్పీ గ్రామాల మీద పోలీసులతో దాడులు చేస్తుండేవాడు. దొరికిన కమ్యూనిస్టు కార్యకర్తలను కిరాతకంగా చిత్రహింసలు పెట్టేవాడు. గెరిల్లాలనైతే కాల్చి చంపేవాడు. అతడంటే ప్రజలు ఎంతగానో భయపడేవారు. కందిబండ గ్రామానికి చెందిన 'దొర' అని పిలవబడే జానకిరామారావు కూడా ప్రజలను హింసించేవాడు. అతడు బారెడ్డి సైదులురెడ్డి, బాసెట్టి రాములు, మరో కామ్రేడ్‌ను పోలీసులకు పట్టించి వారిని కాల్చిచంపడానికి కారకుడయ్యాడు. దీనికి కారణమైన డిఎస్పీని, భూస్వామిని కాల్చిచంపాలని పార్టీ నిర్ణయించింది. డిఎస్పీ, 'దొర' జానకిరామారావు ఇద్దరూ లాయరు గారింటికి చీట్లపేక ఆడటానికి వస్తుండేవారు.

ఆ ప్రజాకంటకులను చంపే బాధ్యతను పార్టీ కామ్రేడ్ మేదరమెట్ల సీతారామయ్య (చెంచయ్య)కు అప్పగించింది. పోటు రామయ్య అనే కామ్రేడ్‌ను తోడు చేసుకొని దాడికి పథకం సిద్ధం చేశాడు మేదరమెట్ల.

లాయర్ ఇంటికి అందుబాటులో ఉన్న వారి ద్వారా ఆ ఇంటిమ్యాపు, హాలు మ్యాపు సంపాదించాడు. చీట్లపేక ఆడే కుర్చీలు ఎక్కడుంటాయి, ఎటువైపు కుర్చీలో ఎవరు కూర్చుంటారో కూడా వివరంగా సమాచారం సేకరించాడు.

డిఎస్పీకి, కందిబండ దొర

జానకిరామారావుకు తప్ప ఇతరులెవ్వరికీ హాని జరగకుండా చూడాలని నిర్ణయించాడు.

సమాచారం ఇచ్చిన వ్యక్తి చీట్లపేకాట దగ్గర ఎవరి కుర్చీల్లో వారే కూర్చున్నారని చెప్పాడు.

చీకటి పడిన తరువాత వారంతా ఆటలో పూర్తిగా లీనమై ఉన్న సమయంలో మేదరమెట్ల, పోటు రామయ్య ప్లాను ప్రకారం ఆ ఇంటిపై మెరుపుదాడిచేసి, ఆ రెండు కుర్చీల్లో ఉన్నవారిపై కాల్పులు జరిపి క్షణంలో మాయమయ్యారు.

వారలా మాయమై జైలువైపునకు వెళ్లారు. జైలు ముందు సెంట్రీ ఒక్కడే కాపలా కాస్తున్నాడు.

వీరిద్దరూ అతని వెనుకగా వెళ్ళి చేతులు వెనక్కి విరిచి పట్టుకొని కదలకుండా చేసి అతనివద్ద ఉన్న ఆయుధం గుంజుకొని హుజూర్‌నగర్ గుట్టలవైపు కదలిపోయారు.

మరునాడు పేపరు వార్తలనుబట్టి కందిబండ 'దొర' జానకిరామారావు, ప్రభుత్వ డాక్టరు అక్కడికక్కడే చనిపోయారని, డిఎస్పీ చనిపోలేదని, ఆరోజు డిఎస్పీ పేకాటకు రాలేదని మేదరమెట్లకు తెలిసింది.

డిఎస్పీ ఎప్పుడూ కూర్చుండే కుర్చీలో ఆరోజు ప్రభుత్వ డాక్టర్ కూర్చున్నాడు. అయితే ఇతడు కూడా కమ్యూనిస్టు వ్యతిరేకిగా పేరుపడిఉన్నాడు. కాబట్టి డాక్టర్‌ను మేదరమెట్ల దళం చంపాలనే చంపిందని ప్రజలు అనుకున్నారు. ఈ దాడిలో ప్రజాకంటకుడు కందిబండ 'దొర' జానకిరామారావు చనిపోయినందుకు ప్రజలు ఎంతగానో సంతోషించారు.

* * *

బ్రిగేడియర్ డగోల్కర్ అనే మిలటరీ అధికారి నాయకత్వంలో పంజాబ్ రెజిమెంట్ హుజూర్ నగర్ ప్రాంతంలో దిగింది. డగోల్కర్ వచ్చీరావడంతోనే దాడులు తీవ్రతరం చేశాడు. ఆరడుగుల పొడవుగా, బలిష్టంగా ఉండే డగోల్కర్‌ను చూడటంతోనే ప్రజలు హడలిపోయేవారు. ప్రజల్లో భయాందోళనలు తొలగించాలంటే సైనికులమీద ఒకటి, రెండు గట్టిదెబ్బలు పడవలసిందేనని పార్టీ నిర్ణయించింది.

మిర్యాలగూడెం తాలూకా రాయనిపాలెం గ్రామంలో బ్రిగేడియర్ డగోల్కర్ ఒక మిలటరీ క్యాంప్ పెట్టాడు. ఆ క్యాంప్ నుండి రోజూ సాయంత్రం ఇద్దరు సైనికులు ఆయుధాలతో బయలుదేరి ములకలకాలువ గ్రామానికి గస్తీకి వచ్చేవారు.

పార్టీ నిర్ణయం మేరకు మేదరమెట్ల మరో కామ్రేడ్‌ను తోడుచేసుకొని ఓ రోజు పట్టపగలే బయలుదేరాడు. వరిపొలాలు కోతలు కోసే సమయం అది. అందుకని ఒక వరిగడ్డికట్టలో ఆయుధాలు దాచుకొని, పొలాలమీదుగా వరికంకులు, పరిగ ఏరుకుంటున్న వారిలాగా, అక్కడక్కడా గడ్డికట్టలు ఇవ్వమని అడుక్కుంటూ రాయనిపాలెం - ములకలకాలువ గ్రామాల మధ్య పోలీసుల గస్తీ దరిదాపులోకి వచ్చిచేరారు. రాళ్ళతో పేర్చికట్టిన గోడ ఒకటి ఉంటే అక్కడ ఆగి మాటువేసి కూర్చున్నారు.

చీకటి పడబోతున్న సమయమది. యథావిధిగా ఇద్దరు సైనికులు పెద్దగా మాట్లాడుకుంటూ వస్తున్నారు. వారిని కొంచెం ముందుకెళ్ళనిచ్చి కామ్రేడ్ మేదరమెట్ల, పక్కనున్న దళ సభ్యుడు తమ వద్ద ఆయుధాలతో చెరొకరిపై గురిచూసి పేల్చారు. అంతే సైనికులిద్దరూ వెనుకకు తిరిగి చూడకుండా ముందుకు నిట్టనిలువుగా తాటి చెట్ల మాదిరిగా కూలిపోయారు.

...యిన సైనికులవద్ద ఆయుధాలను తీసుకొని వారు ...క్కడ్నుంచి తప్పుకున్నారు.

***

మిర్యాలగూడ తాలూకాలోనే అడవిదేవులపల్లి గ్రామంలో పంజాబ్ మిలటరీ రాత్రిపూట గస్తీకి వచ్చినప్పుడు ప్రజలను కనపడినవారిని కనపడినట్లు కొడుతుండేవారు. మహిళలు కనపడితేచాలు అసభ్యంగా ప్రవర్తించేవారు. ఏనుగుల్లాంటి మనుషులు వారు. ఇక్కడి భాషరాదు. వారు ఏమైనా అడుగుతున్నారో, బెదిరిస్తున్నారో అర్థమయ్యేదికాదు.

మిలటరీ యథేచ్ఛగా, నిర్భయంగా గస్తీ తిరగడాన్ని ఆపాలని, గస్తీకి వచ్చినప్పుడు వారి మీద దాడి చేయాలని పార్టీ నిర్ణయించింది.

ఇది అమలు చేయడానికి కామ్రేడ్ మేదరమెట్లను, హుజూర్‌నగర్ తాలూకా అలంగాపురం గ్రామానికి చెందిన కేళం వెంకయ్య అనే కామ్రేడ్‌ను పురమాయించి అడవిదేవులపల్లి గ్రామానికి పంపింది.

రాత్రిపూట బజారులో అనువుగా ఉన్నచోట ఒక ఇంటి రైతుతో మాట్లాడి ఆ ఇంటి ముందు ఎడ్లబండిని విడిచిఉంచే ఏర్పాటు చేసుకున్నారు. ఆ బండిని చాటు చేసుకుని కూర్చున్నారు.

ఇద్దరు సైనికులు గస్తీకి వస్తున్నారు.

సరిగ్గా తమకు అందుబాటులోకి రాగానే కామ్రేడ్స్ మేదరమెట్ల, వెంకయ్య సైనికులపై కాల్పులు జరిపారు. వారి కాల్పులకు ఒకడు పడిపోయాడు. మరో సైనికుడు వెనక్కి తిరిగి వారిపై కాల్పులు జరిపాడు. ఒక గుండు కామ్రేడ్ కేళం వెంకయ్యకు తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. కామ్రేడ్ మేదరమెట్ల తిరిగి కాల్పులు జరపగా మిగిలిన మిలటరీవాడు కూడా పడిపోయాడు. రెండో సైనికుడు కూడా చనిపోయాడని అనుకొని మేదరమెట్ల మిలటరీ ఆయుధాలు స్వాధీనం చేసుకోవడానికి వెళ్ళాడు.

రెండోసారి పడిపోయిన సైనికుడు లేచి మేదరమెట్లకు తుపాకీ ఎక్కుపెట్టాడు. వెంటనే మేదరమెట్ల వంగి ఆ సైనికుడు రెండు కాళ్ళమధ్యలో తనతలపెట్టి వాడిని పైకిలేపి ఎత్తిపడవేసి అతడి ఆయుధం లాక్కొని తృటిలో చీకట్లో కలిసిపోయాడు.

***

కామ్రేడ్ మేదరమెట్ల దళం ఒకసారి మిర్యాల గూడెం తాలూకా బొత్తలపాలెం గ్రామ పరిసరాల్లోకి తెల్లవారుజామున చేరుకుంది. బాగా పెరిగిన ఒక జొన్నచేలో దళం మకాంవేసి ఉంది. దళంలో ఆ గ్రామానికి చెందిన అక్కల సైదయ్య ఉన్నాడు. అది తన స్వగ్రామంకాబట్టి ఉదయం 10గంటలకల్లా దళానికి భోజనాలు పంపిస్తానని గ్రామంలోకి వెళ్ళాడు. అయితే ఆ గ్రామ పట్వారీ గ్రామం నాలుగువైపులా 'డ్యూటీ గుడిసెలు' వేయించి ప్రజలను వంతులవారీగా కాపలాలు ఉంచాడు. అక్కలసైదయ్య తెల్లవారుజామున గ్రామంలోకి రావడాన్ని డ్యూటీ గుడిసెల్లో కాపలా ఉన్న వారు చూసి పట్వారీకి కబురందించారు. పట్వారీ మిలటరీకి కబురుపంపాడు. మరోవైపు సైదయ్యను సాదరంగా ఆహ్వానించి దళానికి భోజన ఏర్పాటు చేశాడు. సైదయ్యకు భోజనం వడ్డించే సమయానికి గ్రామంలోకి మిలటరీ దిగింది. భోజనానికి కూర్చున్న సైదయ్యను పట్వారీ మనుషులు పెడరెక్కలు విరిచికట్టి మిలటరీకి అప్పగించారు.

సైదయ్యను మిలటరీ మూడు రోజులపాటు చిత్రహింసలకు గురిచేసి నాలుగవరోజు కాల్చిచంపింది. అయితే సైదయ్య తననెన్ని చిత్రహింసలు పెట్టినా దళం గురించి ఒక్క ముక్క కూడా మిలటరీకి చెప్పలేదు.



అనుకున్న సమయానికి దళానికి భోజనాలు రాకపోవడంతో దళం తక్షణం అక్కడ్నుంచి తప్పుకుంది. వారం రోజుల తర్వాత దళం ఒకరోజు రాత్రి ఆ గ్రామం వచ్చి రాత్రి డ్యూటీ గుడిసెలమీద కాల్పులు జరిపి వాటిలోని కావలా దారులను చెల్లాచెదురు చేశారు.

మరో రెండు వారాలు గడిచిన తరువాత కామ్రేడ్ అక్కల సైదయ్యను మిలటరీకి పట్టి ఇచ్చిన పట్వారీకోసం దళం కాపలావేసింది. పట్వారీ రోజూ ఉదయమే మోటకట్టడానికి బావివద్దకు వస్తాడు. ఈ సమాచారం తెలుసుకున్న కామ్రేడ్ మేదరమెట్ల, మరొక కామ్రేడ్ కలిసి తెల్లవారకముందే మోట బావివద్దకు చేరుకొని మాటువేసి కూర్చున్నారు. బావివద్దకు పట్వారీ వచ్చి మోట బొక్కెన, మోకు సరిచేస్తుండగానే ఒకే ఒక తుపాకీ దెబ్బతో ఆ క్రూరుడిని కాల్చిచంపారు.

***

కామ్రేడ్ మేదరమెట్ల స్వగ్రామమైన వెలిదండలో వక్కవంతుల సోమయ్య, కుమ్మరి నారాయణ, తడకమళ్ళ వెంకటరామయ్య అనేవారు రజకార్లకు, మిలటరీకి ఏజెంటుగిరీ చేస్తుండేవాడు. వీరు పార్టీ కార్యకర్తల ఇళ్ళు తగులబెట్టేవారు. ప్రజలను బెదిరించి దోచుకునేవారు. కుటుంబాలను హింసించేవారు. కార్యకర్తల ఆచూకీని పోలీసులకు చెప్పి జైళ్ళపాలు చేసేవారు. కామ్రేడ్ మేదరమెట్ల దళం వారిపై దాడిచేసి ఒకే రోజు కాల్చి చంపింది. అలాగే మునగాల పరగణా గ్రామమైన కొక్కిరేణికి ఒక వ్యక్తి వైద్యం చేయడానికి వచ్చి అక్కడ నివసిస్తున్నాడు. అతను వైద్యం చేసే పేరుతో వెలిదండ, దానిచుట్టుపక్కల గ్రామాలు తిరుగుతూ కమ్యూనిస్టు కార్యకర్తల ఆచూకీ సేకరించి మిలటరీకి అందజేసేవాడు. ఇది గమనించిన పార్టీ అతనిపై నిఘాపెట్టి అది వాస్తవమని ధ్రువపరచుకొని అతనిపై చర్య తీసుకోవాలని నిర్ణయించింది. దీనిలో కామ్రేడ్ మేదరమెట్ల దళం ఒక స్త్రీ ద్వారా అతనిని ప్రలోభపెట్టి ఊరి బయట చేలోకి రప్పించి కాల్చివేసింది.

***

గుంటూరుజిల్లా, సత్తెనపల్లి తాలూకా అద్దూరువద్ద అడవి దాపున అచ్చంపేట గ్రామం ఉంది. ఇక్కడి పోలీస్‌స్టేషన్‌లో 15మంది పోలీసులు ఉన్నారు. అదనంగా రెండు బెలాలియన్ల మిలిటరీని తీసుకువచ్చి ఇక్కడ పెట్టారు. కామ్రేడ్ మేదరమెట్ల దళంతోపాటు మరో రెండు దళాలను కూడా కలిపి ఈ పోలీస్‌స్టేషన్‌పై దాడికి పార్టీ నిర్ణయించింది. మూడు దళాలూ దేనికదే విడివడి మూడు వైపులా దాడికి సిద్ధమయ్యాయి.

దళాలు దాడికి వెళ్ళేవరకూ పోలీసూలూ, మిలటరీ ఏమరుపాటున ఉన్నారు. మొదటి దళం స్టేషన్ వసారాలోకి వెళ్ళి సెంట్రీని కాల్చివేసింది. స్టేషన్‌లోపల చీట్లపేక ఆడుతున్న వారిపై కాల్పులు జరిపారు. కొందరు గాయపడగా, మిగిలినవారు అటూ ఇటూ చెల్లా చెదురయ్యారు. ముందు అనుకున్న ప్రకారం దళంలోని అన్ని బ్యాచీలు స్టేషన్‌కు చేరి ఆయుధాలన్నీ సేకరించారు. మొత్తం 74 షాట్‌గన్లు, రైఫిళ్లు, వెయ్యితూటాలు దొరికాయి. ఆయుధాలు కట్టలు కట్టుకొని దళం కాలినడకన కృష్ణానదిని దాటి వెళ్ళిపోయింది.

1950 సెప్టెంబర్ 25వ తేదీన గుంటూరుజిల్లా ఏలంపేట పోలీస్‌స్టేషన్‌పై దాడికి దళం వెళ్ళింది. ఇది కృష్ణానది రేవు ఉన్న గ్రామం. కామ్రేడ్ మేదరమెట్ల నాయకత్వంలోని దళం స్టేషన్‌పై దాడి చేయాలని పార్టీ నిర్ణయించింది. ఈ స్టేషన్‌పై దాడిలో పెంటయ్య అనే కామ్రేడ్ పోలీసుల కాల్పులకు అమరుడయ్యాడు. దీనితో దళ సభ్యులలో పట్టుదల హెచ్చి వీరోచితంగా కాల్పులు జరపడంతో పోలీసులు లొంగిపోయి ఆయుధాలను దళానికి అప్పగించారు. 5 రైఫిళ్ళు, ఒక రివాల్వర్, ఒక పెట్టి తూటాలు దొరికాయి. మిగిలిన ఆయుధాలు కాల్పుల్లో పనికి రాకుండా పోయాయి. కామ్రేడ్ పెంటయ్య భౌతిక కాయానికి కృష్ణానదీ తీరాన అరుణాంజలి ఘటించి బరువెక్కిన హృదయంతో కృష్ణమ్మ ప్రవాహంలోకి వదిలివేశారు.

అలాగే ఒకనాడు కర్నూలు మార్కాపురం తాలూకా (ప్రస్తుతం ప్రకాశంజిల్లాలో ఉంది) లోని పుల్లల చెరువు పోలీస్ స్టేషన్‌పై కూడా కామ్రేడ్ మేదరమెట్ల దళం దాడి చేసింది. ఈ దాడిలో సెంట్రీ చనిపోయాడు. దీనితో స్టేషన్‌లో ఉన్న మిలటరీ ఆయుధాలను వదిలి పరారయ్యింది. మొత్తం 12 రైఫిళ్ళు, 5 బర్మార్లు, ఒక రివాల్వర్ అక్కడ దొరికాయి.

కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పెనుగంచిప్రోలు (ఇప్పుడిది మండల కేంద్రం) పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయాలని పార్టీ నిర్ణయించింది. ఆరోజు సాయంత్రానికల్లా దళం పెనుగంచిప్రోలు వెళ్ళాలని నిర్ణయం. ఆ మేరకు కామ్రేడ్ మేదరమెట్ల మరో

(మిగతా 23వ పేజీలో)

'మనసు' నవలల విహంగ వీక్షణ

తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ అనే ఈ పుస్తకం లోగడ ఉత్తమ సాహిత్య విమర్శ గ్రంథంగా సాహిత్య అకాడమీ బహుమతి పొందింది. చాలా కాలం తర్వాత పునర్ముద్రణ ఇది. మనో వైజ్ఞానిక శాస్త్రంలో వేర్వేరు సిద్ధాంతాలను, నవలా రచనపై వాటి ప్రభావాన్ని రచయిత కోడూరి శ్రీరామమూర్తి వివరంగా పరిశీలించారు. ఆయన శైలి కూడా చదివించేదిగా వుంది.

1977కు ముందు వచ్చిన వాటినే పరిశీలించినా తర్వాతి కాలంలో వచ్చిన కొన్ని పుస్తకాలపై అనుబంధంలో క్లుప్తంగా విశ్లేషణ ఇచ్చారు. ఈ కోవలో ప్రముఖమైనవిగా భావించిన నవలలను ప్రత్యేకంగానూ, మరికొన్నింటిని సామూహికంగానూ పరామర్శించారు.

రచన: కోడూరి శ్రీరామమూర్తి,
వెల: రూ. 75,
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

అయితే సాధారణంగా మనోవిజ్ఞాన పరిశీలనలో ఒక లోపం జరుగుతుంటుంది. ఇదే రచనల్లోనూ తరచూ వ్యక్తమవుతుంటుంది. మనిషిని, మనసును విడదీసి చూడటం ఆ లోపం. మనిషి స్వభావం బాల్యంలో పడే ప్రభావాల వల్ల రూపొందుతుందనేది అసత్యం కాకపోయినా అనేక విషయాలు దాన్ని ప్రభావితం చేస్తాయి. మిగిలిన అన్ని అంశాలలాగే మనస్తత్వం కూడా మార్పులకు గురవుతూనే వుంటుంది. ఒక వయసు తర్వాత మనుషులు మారరని చెప్పినా నిజానికి మనుషులు అనుదినం అనేకం నేర్చుకుంటూ వుంటారు. వాటిని సవ్యంగా అర్థం చేసుకోగలిగితే ఒక విధంగా, లేకుంటే మరో విధంగా వారి మనస్తత్వం మారుతుంది. అల్పత్వ భావన, ఆధిక్యతా భావన(నిజానికి ఈ రెండూ ఒకటే) విలువలు అన్నీ ఈ క్రమంలోనే పెంపొందుతాయి. మనసు గురించి ఆత్రేయ వంటి కవులు చాలా రాశారు. నిజానికి మనసు బ్రహ్మపదార్థమేమీ కాదు. మనిషి ఆలోచనలు, ఆచరణలో అవి ప్రతిఫలించే తీరు, తిరిగి ఆలోచనలపై వాటి ప్రభావం ఇవన్నీ కలిస్తేనే మనస్తత్వం. అన్నిటిని సెక్స్ సంబంధాలే నిర్ధారిస్తాయని ఫ్రాయిడ్.చెప్పినట్టు చలామణీ అయ్యే భావం నిజానికి చాలా పాక్షికమైనది. ఫ్రాయిడ్‌పై పూర్తిగా ఆధారపడకూడదనుకుంటూనే చాలామంది ఆయన చెప్పిన ఈడిపస్ కాంప్లెక్సును యాంత్రికంగా అన్వయించుతుంటారు.

అయితే దురదృష్టవశాత్తూ మనసు అని రాస్తేనే లేదా చైతన్య స్రవంతి వంటి ప్రక్రియను అనుసరిస్తేనే మనస్తత్వ చిత్రణ అని భావించే ఒక పొరబాటు భావన చాలా మందిలో వుంది. ఆ లోపం కొంత ఈ పుస్తకంలోనూ వుంది. లేకపోతే చలం తర్వాత అద్వితీయ ప్రభావం చూపి, మానవ సంబంధాలనూ, మనస్తత్వాలనూ అమోఘంగా విశ్లేషించిన కొడవటిగంటి కుటుంబరావు రచనలను దాదాపు విస్మరించేవారు కాదు. అలాగే వాసిరెడ్డి సీతాదేవి సమత నవలలో అరుంధతి వంటి పాత్రను పరామర్శించకుండా వదిలేవారూ కాదు.

సామాజిక కోణం లోపించబట్టే ఆయన బుచ్చిబాబు చివరకు మిగిలేదిలో రచయిత ప్రస్తావించిన ప్రాంతీయ అసమానతల ప్రభావాన్ని పట్టించుకోకుండా వదిలేశారు. ఆ నవల నాయకుడు దయానిధి అమృతతో పెంచుకున్న అనుబంధం కామంగా ముగిసింది అని ఆయన చేసిన వ్యాఖ్యతో ఏకీభవించడం కష్టం. ఇలాటి అరకొర సూత్రీకరణలు ఇంకా వున్నాయి. గోపీచంద్ అసమర్థుని జీవయాత్రలో సీతారామరావును హేతువాదిగా, జ్ఞానాన్వేషిగా పరిగణించడం సాధారణంగా ఊహకందేది కాదు. భార్యా భర్తలు సమాన గౌరవంతో స్నేహ పూర్వకంగా దాంపత్య జీవితం గడపాలనే ఆకాంక్షతో రంగనాయకమ్మ రాసిన హాస్యం జోడించి రాసిన స్వీట్‌హోంలో విమల పాత్ర పరిధిని, పరమార్థాన్ని అర్థం చేసుకోవడంలోనూ ఆయన విఫలమైనారు. విశ్వనాథ సత్యనారాయణ వ్యవస్థను కాపాడే తత్వం గలవారని అయితే ఆ వ్యవస్థ సనాతన వ్యవస్తే అని యధాలాపంగా రాశారు. కాలంతో పాటు మారలేని వారిలో చోటు చేసుకునే వైకల్యాలను అర్థం చేసుకోలేదు. ఫెమినిజం వంటి వాదనలు పెద్దగా ముందుకు రాని ఆ రోజులలోనే స్త్రీ విముక్తి ఉద్యమంలో విపరీత ధోరణులు అని శీర్షిక ఇవ్వడంలో శ్రీరామమూర్తి దృక్పథం అర్థమవుతుంది.

ఈ రచనలో నవీన్ అంపశయ్యకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వక పోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

స్త్రీ పురుష సంబంధాలు ఎంత ప్రధానమైనా మానవ సమాజంలో అవి ఒక భాగం మాత్రమేనని స్వయంగా చలమే చెప్పారు. సమాజంలో వచ్చే దశల వారీ పరివర్తనలు, వాటిలో వర్గరీత్యా ఆ వ్యక్తి స్థానం, పరిస్థితులను బట్టి వచ్చే అవకాశాలు , అవరోధాలు, ఆరోగ్య అనారోగ్యాలు, మరణాలు, కుల మతాలు, చారిత్రిక పరిణామాలు, యుద్ధాలు, ప్రాంతాల తేడాలు, కుటుంబాల తీరుతెన్నులు, కొన్నిసార్లు యాదృచ్ఛిక ఘటనలు ఆయా సందర్భాలలో తలెత్తే సంఘర్షణలు ఇలా అనేక అంశాలు కలిపి చూడాల్సిన మనిషి మనస్తత్వాన్ని ఏదో ఒక అంశం చుట్టే తిప్పడం తీరం చేర్చదు. వ్యక్తికి, సమాజానికి వున్న లేదా వుందని చెప్పబడుతున్న వైరుధ్యాన్ని కేంద్రంగా చేసుకుని మనస్తత్వాలను పరిశీలించడంలో చిక్కులు తప్పవు. వైరుధ్యాలకు గల సామాజిక పునాదులు చూడకుండా వ్యక్తిగతమైనవిగా భావించడం, సామాజిక సమస్యలకు వ్యక్తిగత పరిష్కారాలు కోరడం సగం సంఘర్షణలకు మూలం. వ్యక్తివాద పరిధిలో పరిభ్రమించే రచయితలు తమ రచనలలో అనివార్యంగా ఈ పొరబాటుకు గురవుతారు.

మానవ మనస్తత్వాల లోతులు చూపడంలోనూ ఎందరో రచయితలు మహత్తర ప్రతిభ చూపారు. ఆ రచనలు, కళలు కూడా ఎంతో కొంత మేరకు మనుషులపై ప్రభావం చూపుతుంటాయి. అలాటి అనేక రచనలను ఒక్క చోటనే పాఠకుడికి పరిచయం చేసే కోడూరి శ్రీరామమూర్తి పుస్తకం ఆహ్వానించదగినది.

- తెలకపల్లి రవి

స్వీకారం



ప్రపంచ చరిత్రలో సోషలిజం అనుభవాలకు, ఆటుపోట్లకు సంబంధించి చైనా కమ్యూనిస్టు పార్టీ అవగాహనను వివరించే రెండు ముఖ్యమైన పత్రాలు ఈ పుస్తకంలో పొందుపరచబడ్డాయి. మొదటిది చైనా విశ్లేషకుడు యాంగ్ చుంగుయి రాసిన వ్యాసం. యాంగ్ తన వ్యాసంలో సోవియట్, తూర్పు యూరప్ పరిణామాలు, నేపథ్యంలో సోషలిజం నిర్మాణంలో ఎదురైన అనుభవాలను సమీక్షించుతూ జరిగిన పొరబాట్లను వివరించారు. రెండవది చైనా పార్టీ ప్రధాన కార్యదర్శి, దేశాధ్యక్షుడు జియాంగ్ జెమిన్ చైనా పార్టీ 80వ వార్షికోత్సవ సందర్భంగా చేసిన ప్రసంగం. దానిలో ఆయన ప్రస్తుతం తాము అనుసరిస్తున్న విధానాలను వివరించారు.

సోషలిజం ప్రస్థానం-చారిత్రక అనుభవం
అనువాదం : ఎస్.వెంకట్రావు; వెల : రూ. 12,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



వ్యక్తిత్వ వికాసాన్ని వృద్ధి చేసుకోవడానికి తమ నైజాన్ని, ప్రవర్తనను స్వస్వరూప సమీక్ష చేసుకోవాలి. త్వరత్వరగా మారుతున్న పరిస్థితులు నైజానికి, ప్రవర్తనకు ఘర్షణలను సృష్టిస్తున్నాయి. సమాచార, సాంకేతిక విప్లవాలు ప్రవర్తనను నియంత్రిస్తున్నాయి. ప్రవర్తన మారినంత తొందరగా నైజం మారడం లేదు. పర్యవసానంగా అంతర్గత ఘర్షణలు ఎక్కువవుతున్నాయి.

స్వస్వరూప సమీక్ష (వ్యక్తిత్వ వికాసం)
రచన : అట్లూరి వెంకటేశ్వరరావు; **వెల :** రూ. 40;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



1981-91 మధ్య కాలంలో రాసిన కథలను ఈ సంపుటిలో ప్రచురించారు. ఇందులో ఎక్కువ కథలు ప్రజా సాహితిలో ప్రచురితమైనవే. మిగిలిన కథలు వివిధ వార, మాస, దినపత్రికలలో ప్రచురించ బడ్డాయి.

నగరంలో అరణ్యం
రచన : డా॥ సిహెచ్. శాంతికుమార్;
వెల: రూ. 40; **ప్రతులకు :** డా॥ శాంతికుమార్, లాయర్ పేట, ఒంగోలు, మైత్రీ బుక్ హౌస్, మసీదు వీధి, కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ - 2

'అక్షర జ్ఞానం శూన్యం సాంకేతిక పరిజ్ఞానం అమోఘం'

రమణ

మనిషిని చూస్తే ఎంతో అమాయకత్వం కనపడుతుంది. అక్షరజ్ఞానం అసలే లేదని మాటని బట్టి అర్ధమవుతుంది. అయితే ఎవరికీ అంతుబట్టని మేధాసంపద మాత్రం అతనిసొత్తు. విజ్ఞాన సముపార్జనకు విద్యావేత్తే కానవసరం లేదని నిరూపిస్తున్న ఆ యువకుని పేరు మందపల్లి రమణ. తూర్పు గోదావరి జిల్లా అనవర్తికి సమీపంలోని మారుమూల కుగ్రామమైన 'ముక్కినాడ'లో పశువులను మేపుకొనే ఈ యువకుడికి సాంకేతిక పరిజ్ఞానం ఉందంటే ఎవరూ నమ్మరు.

అసలు రమణకి గల పరిజ్ఞానం ఏమిటంటే నమూనా పొక్లెయినర్లు, టిప్పర్లు, జెసిబి యంత్రాలే కాక లారీలు, మోటార్‌బైక్‌లు రూపొందించడం. అసలు యంత్రాల మాదిరిగానే పోలికలో ఉండటంతో పాటు వాటి పనితీరు కూడా అసలు యంత్రాల మాదిరిగానే ఉండటం విశేషం. వీటి తయారీకి రేకు ముక్కలు, ఊచలు, చక్రాలు, చిన్న చిన్న వైర్లు ఉపయోగిస్తున్నాడు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రమణ తన పదేళ్ల వయస్సు నుండే ఇలాంటి వాటిని తయారు చేయడంపై ఆసక్తిని పెంచుకున్నట్లు చెప్పాడు.



టిప్పర్‌పై ఇసుక పోస్తున్న పొక్లెయినర్

దేనినయినా ఒకసారి చూసి దాని పనితీరుని పరిశీలించి వెంటనే పసిగట్టేయడం అతని ప్రత్యేకత. అంతే వెంటనే దానికి కావాల్సిన పరికరాలేమిటో సమకూర్చుకుంటాడు. కొద్దిగంటల్లో అసలు యంత్రాన్ని పోలే విధంగా నమూనా యంత్రాన్ని తయారు చేస్తాడు. ఎవరి సలహాలు, సూచనలు లేకుండానే తయారు చేస్తున్నాడు. బీదరికం, ప్రోత్సహించే వారు లేకపోవడం వెరసి ఈ మట్టిలో మాణిక్యం ప్రతిభా పాటవాలు వెలుగులోకి రాకుండా ఆ గ్రామంలో మగ్గిపోతున్నాయి. అయితే ఇంతటి ప్రజ్ఞా పాటవాన్ని ప్రోత్సహించే వారు లేకపోగా వాటిని తమకు అనుకూలంగా ఉపయోగించుకోవడం బాధాకరం. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా సైన్స్‌ఫేర్‌లో ఇతను తయారుచేసిన వస్తువులను ఒక పాఠశాల ఉపాధ్యాయుడు పట్టుకెళ్ళి తమ పాఠశాల విద్యార్థులే తయారు చేసుకున్నట్లు చెప్పుకొని ప్రైజ్ గెలుచుకొన్నారని రమణ అమాయకంగా చెప్పాడు. చిన్న వయస్సులోనే తండ్రి చనిపోవడం వలన కుటుంబ భారం మోసేందుకు కూలి పనైనా చేస్తున్నాడు రమణ. ఇలాంటి ప్రతిభా పాటవాలు గల వారిని ప్రభుత్వ అధికారులు గానీ, దాతలు గాని ప్రోత్సహించి అతని ప్రతిభకు మెరుగులుదిద్దితే బాగుంటుంది.

-ఆర్. గోపాలకృష్ణ



రేకులు, ఊచలతో తయారు చేసిన పొక్లెయినర్



రమణ రూపొందించిన ఇతర యంత్రాలు

వోగేటి ఇందిరాదేవి

ఇదండీ  లోకం



పేరుందుకులెండి గాని అదొక విద్యాలయం. అందులో ఆడవారి స్టాఫ్ రూమ్. "చంద్రమణిగారూ! మా పాప ఫ్రాక్ మీద ఎంబ్రాయిడరీతో పువ్వులు కుట్టడం నేర్పిస్తానన్నారు. నేర్పించరా?" అంటూ తను కొన్న గౌను బట్ట బయటికి తీసింది వారిజ పర్సులోంచి.

"అమ్మయ్యో! నాకసలు టైము లేదు వారిజగారూ! అనేసింది కచ్చితంగా చంద్రమణి.

"ఆవిడ టైమంతా వాళ్ళ ఆయన షర్ట్ మీద పువ్వులు కుట్టడంతో సరిపోతుంటే మీ పాప ఫ్రాక్ దాకా ఆగుతుందండీ వారిజగారూ" కొంటెతనం ఒలికించింది సుధ.

"ఛ పొండి, అదేం కాదు", సిగ్గునభినయించింది సదరు చంద్రమణి.

"ఏదికాదు? మీకు కొత్తగా పెళ్ళవడమా? బొత్తిగా టైమ్ లేకపోవడమా? మీ శ్రీవారి షర్ట్‌మీద పూలు కుట్టడమా?" చిన్న చురక అంటించింది మిస్ కేవల.

"మీ పెళ్ళై ఆరు నెలలయిందాయె చంద్రమణిగారు! తర్వాత అరడజను మంది స్టాఫ్ పిల్లలకి కుట్టి పెట్టారు కదండీ, చిత్రవిచిత్రమైన నగిషీలతో", అనబోయి బలవంతాన ఆగిపోయింది వారిజ.

"పోనీ ఎలా కుడితే బావుంటుందో, ఏ రంగుదారం బాగుంటుందోనైనా చెప్పరూ ఎవరైనా సరే ప్లీజ్" అని బతిమిలాడింది తోటి ఉద్యోగినులు కదా అని "అమ్మో మాకు తెలియదండి" అని అందరు తమ అశక్తతను నిరాటంకంగా వ్యక్తపరిచేశారు. పద్మమణి సీరియస్‌గా బొమ్మకి పరికిణీ కుడుతూన్నది. కేవల ఊలుతో స్వెటర్ అల్లుతూంది. కుముదిని, విక్టోరియా ఇద్దరూ జామ్‌లు చేయడం గురించి చెప్పుకుంటున్నారు. లంచ్ అవర్లో తలా ఒక చేతి పనిలో నిమగ్నమై ఉన్నారు. నాకే కదా ఏం రాదు - అనుకుంటూ దీర్ఘ నిశ్వాసం విడిచి "రాజశేఖర చరిత్రము" అందుకుంది చదవడానికి. ఫ్చ్ వీళ్ళందరికీ ఇన్ని చేతి పనులు ఎలా వచ్చో - రోజూ స్టాఫ్ రూములో ఖాళీ టైములో కూర్చుని రకరకాల బట్టలు తెచ్చి నానా విధాల డిజైన్లు కుడుతూ ఉంటారు. ఒకావిడ నేర్పుతో బొమ్మలు చేస్తే, మరొక ఆవిడ పూసలతో బట్టలల్లుతుంటుంది. ఒకావిడ షాల్‌మీద చెమ్కీ పూలు కుడితే మరొకావిడ క్రోషియో వైర్‌తో బుట్టలల్లేస్తుంది. పైగా వీటి గురించిన డిస్కషన్లతో నిండిపోయి మహాబిజీగా ఉంటుంది స్టాఫ్ రూమ్.

మొత్తానికి మొన్నీ మధ్యనే ఈ మహానగరానికి ట్రాన్స్‌ఫర్ అయింది వారిజకి. ఇన్నాళ్ళు భర్తకిక్కడ ఉద్యోగం, ఆమెకు ఇంకో ఊర్లో. ఈ తతంగమంతా కళ్ళు విప్పార్చుకుని ఆశ్చర్యంగా చూడడం మొదలు పెట్టింది వారిజ.

చూడగా చూడగా - తన కూతురికి తానే తన చేతులతో ఏదన్నా గౌను కుట్టి ఇస్తే బావుంటుంది అన్న గాఢమైన కోరిక కలిగిందామెకు కూడా.

కాని అతి మామూలు చీరలు కట్టుకుని ఆడంబరం లేకుండా సింపుల్‌గా, ఇంకా చెప్పాలంటే అమాయకంగా ఉంటే వారిజ అంటే లోకువగా ఉంది స్టాఫులో మిగిలిన వాళ్ళకి, ముఖ్యంగా ఆడవాళ్ళకు మరీను, తోటి ఉద్యోగినుల ప్రవర్తన ఎందుకంత ఇదిగా ఉందో తన పట్ల? అనూహ్యంగా ఉంది వారిజకి. ఎందుకంతా అలా చిన్న చూపు చూస్తారు తననొక్క దాన్నీను? షోగ్గా లేదనా? వాళ్ళంతా ఒక గ్రూప్‌గా ఉంటూ, ప్రతి విషయంలో తోడు, నీడగా మెసులుతూ, తననొక్క దాన్ని వేరు చేస్తారు. తనేం పాపం చేసిందని? అని ఎంతో బాధపడేది వారిజ.

ఒక్కోరోజు సాయంత్రం భర్తతో తన బాధంతా చెప్పుకునేది. ఊరడించి ఎన్నో విధాల ధైర్యం చెప్పేవాడాయన.

ఆ తర్వాత కేవల వాళ్ళ దగ్గర ఒక బుట్ట అల్లడమయినా నేర్చుకుందామని విఫల ప్రయత్నం చేసింది వారిజ. తర్వాత కూతురు హైమ పరికిణీ మీద అద్దాలు కుట్టడం నేర్పించమని అందర్నీ బతిమాలి కాదనిపించుకుంది.

అట్లా ఉండగా - ఒకానొక రోజు - వన్ ఫైన్ మార్నింగ్ కాదు ఈవినింగ్ - తన ఇల్లు వెతుక్కుంటూ వచ్చిన చంద్రమణిని చూసి విస్తుపోయింది వారిజ. ఆప్యాయంగా ఆహ్వానించి, ఆదరంగా మాట్లాడుతూ కాఫీ చేసిచ్చింది.

చిత్రం ఏమిటంటే చంద్రమణి కూడా ఎంతో ఇదిగా మాట్లాడుతూ హైమని దగ్గరకు పిల్చింది.

"ఒక్కత్తే పాప కదా మీకు వారిజా, బలే ముద్దొస్తూంది. చూడు పాపా! ఈ ఫ్రాక్ బావుందా! నీ కోసమే కుట్టుకు వచ్చాను. స్వయంగా నా చేత్తో అంటూ తొడగబోయింది.

అడ్డుకుంది వారిజ.

"చక్కగా ఉందండీ గౌనుకేం? కాని మీరు కుట్టి తెస్తే ఏం లాభం? నాకు కుట్టడం రాకపోయాక, నేర్చుకోవాలన్న సరదా తీరకపోయాక, మీరిచ్చినా షాపులో కొన్నా ఒకటే కదండీ. మీరందరూ పిల్లలకు బట్టలు కుడుతూ ఉంటే లీజరవర్సులో నా పాపకి నేను కుడదామని మిమ్మల్ని నేర్పమని అడిగానంతే" అన్నది.

కాస్త చిన్నబుచ్చుకున్నా వెంటనే తమాయించుకుంది చంద్రమణి.

"మీకు కుట్టే శ్రమ తప్పుతుంది కదా అని తెచ్చాను. పోనీ - ఇప్పుడు మటుకు ఏమయింది? రేపటినుండి నా దగ్గర నేర్చుకుందురు గాని" అన్నది.

"ఏవిటి తల్లీ, ఈ అకాల అర్జెంట్ ప్రేమ నా మీద?" అనబోయి, ఆగిపోయి "అక్కరలేదండీ, నేను కుట్టు క్లాసుకి వెళ్తున్నాను, స్కూలు నుండి సరాసరి అటే వెళ్తున్నాను" అన్నది.

అనలు సంగతికి రాక తప్పలేదు చంద్రమణికి. మీ వారు మన హెడ్డాఫీసులో అంత కీలకమయిన ఉద్యోగం చేస్తున్నారని నాకు తెలియదు సుమండీ. నిన్ననే తెలిసింది. ఏవండీ మారు తల్చుకుంటే ఎంతసేపు? నాకు రావల్సిన ప్రమోషను ఆపేసి నా జూనియర్‌కిచ్చారండి. ఎందుకలా జరిగిందో కనుక్కునే నాథుడే లేడు. మీ వారితో చెప్పి నా ప్రమోషను నాకిప్పించరూ ప్లీజ్?" జాలిగా అడిగింది.

"ఆహా లోకం" అనుకుంది వారిజ. అందితే జుట్టు అందకపోతే కాళ్ళూ కదా.

వారిజ పెదవులపై చిరునవ్వు మెదిలింది. "అలాగే మా వారికి చెప్తాను. తన చేతనయినంత సాయం తప్పకుండా చేస్తారు. కానీండి ముందీ ఫ్రాక్ మటుకు తీసుకువెళ్ళిపోండి" అంటూ నిష్కర్షగా చంద్రమణి చేతిలో పెట్టేసింది వారిజ.

ఆ మర్నాటి సాయంత్రం మంచి డాన్సింగు డాల్‌తో సహా వచ్చింది పద్మమణి మొదటిసారిగా. వస్తూనే వారిజను పలకరించకుండా ఆమె మూడేళ్ళ కూతురిని ఎత్తేసుకుని ముద్దులు పెట్టేసుకుంది.

"చిన్నీ! నీ కోసం ఏం తెచ్చానో చూస్కో

గురంగుల బొమ్మ. బావుందా మరి? తీసుకుని ఆడుకో" అంటూ ఆ బొమ్మను హైమ చేతికిచ్చింది. తర్వాత వారిజతో ఎంతో ప్రేమ ఒలికిస్తూ మాట్లాడింది. చివరికి, "ఏవండీ వారిజా! మీ వారి ఉద్యోగం అంత మంచిదని నాకు తెలియలేదు సుమండీ. రెండేళ్ళ క్రితం జబ్బు చేస్తే మూడు నెలలు సెలవు పెట్టా. ఎంత ట్రై చేసినా ఆ మూడు నెలల జీతం ఇంకా రాలేదు. ప్రాణం విసిగిపోతూంది. ఏవండీ మీ వారితో ఒక్కమాట చెప్తే చాలు" అన్నది.

చిర్నవ్వు లీలగా పెదవులను దాటుతూ ఉండగా అంది వారిజ, "తప్పకుండా మా వారితో చెప్తానండీ పద్మగారూ. కానీ ఈ బొమ్మ మాత్రం తీసుకువెళ్ళిపోండి" అంటూ ఇచ్చేసింది.

ఆ వారం రోజులలో, చేత్తో అల్లిన ఒక అందమైన షాల్, పెయింట్ చేసిన ఒక చక్కటి పూలకుండీ, ఒక క్రోషియో వైరు బుట్ట నడిచి వచ్చేసినై వారిజ ఇంటికి. కానీ, వచ్చినంత వేగంగానూ తిరిగి వెళ్ళిపోయినయ్యనుకోండి వారిజ చేత పంపబడి. అది వేరే మాట. అసలు సంగతి ఏమిటంటే - వారిజ పెదవులపై విరిసిన చిరునవ్వు మరింత మెరవటమే కాదు - ఆత్మ విశ్వాసానికి గీటురాయిగా స్థిరంగా నిలిచింది కూడాను. ★

మెరుపువీరుడు మేదరమెట్ల

(19వ పేజీ తరువాయి)

కామ్రేడ్‌తో కలిసి పొగాకుకట్టలో ఆయుధాలు దాచిపెట్టుకొని, పొగాకు అమ్మేవారిలాగా వేషాలు వేసుకొని బయలుదేరి సాయంత్రానికల్లా ఆగ్రామం చేరుకున్నారు. మిగతా దళ సభ్యులు కూడా ముందు అనుకున్న విధంగా వచ్చి కలిశారు.

చీకటిపడగానే స్టేషన్‌పై దాడిచేశారు. సెంట్రీ అప్రమత్తంగా లేదు. పెద్దగా ప్రతిఘటన లేకుండానే లొంగిపోయాడు. దళం 15 తుపాకులను స్వాధీనం చేసుకున్నది. దళం ఆ ఆయుధాల కట్టతో రాత్రంతా నడిచి తెల్లవారే సరికి మల్లాపురం జొన్నచేలోకి చేరుకొని మకాంవేశారు. తిరిగి రాత్రయితేగాని మళ్ళీ వారి ప్రయాణం సాగదు.

జొన్నచేలో పిట్టల్ని కొట్టడానికి కాపలాగా వచ్చిన వ్యక్తి ఇది గమనించి గ్రామ మునసబుకు కబురు చేశాడు. క్షణంలో మిలటరీ చేనును చుట్టుముట్టింది. ఇది గమనించిన దళసభ్యులు కాల్పులు జరుపుకుంటూ బయటపడ్డారు. అయితే నాసరయ్య అనే కామ్రేడ్ జొన్నచేలో దోస తీగతగిలి కిందపడటంతో మిలటరీ అతనిని పట్టుకుంది. మరో కామ్రేడ్ తుపాకీ దెబ్బతగిలినా తప్పించుకోగలిగాడు. అయితే నాసరయ్యను మూడు రోజుల తరువాత చిత్రహింసలకు గురిచేసి చంపివేశారు.

ఆ తరువాత 1951 జూన్ 2వ తేదీన కర్నూలు జిల్లా గిద్దలూరు (ఇప్పుడిది ప్రకాశంజిల్లాలో ఉంది) తాలూకాలోని గడివేముల పోలీస్‌స్టేషన్‌పై కామ్రేడ్ మేదరమెట్ల దళం దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నది. అలాగే మరొక దాడిలో 1951 అక్టోబర్‌లో సుబ్బారెడ్డి గూడెంలో మిలటరీచే మేదరమెట్ల దళం సైన్యంలో సెల్యూట్ కొట్టించుకుంది.

***

ఇన్ని పోలీసు స్టేషన్లపైన దాడి చేయడంలోను, ప్రజా కంటకులైన పలువురిని మట్టుపెట్టడంలోనూ కామ్రేడ్ మేదరమెట్ల సీతారామయ్య అసమాన ధైర్యసాహసాలు చూపడానికి నాడు బ్రిటీష్ సైన్యంలో మేజర్‌గా పనిచేసిన జైపాల్‌సింగ్ వర్మ మిలటరీ, సిద్ధాంత క్లాసులు ఎంతగానో ఉపకరించాయి.

దేశభక్తుడైన మేజర్ జైపాల్‌సింగ్‌పై బ్రిటీష్ ప్రభుత్వం రాజద్రోహం మోపి ఆయనకోసం వేటాడటంతో తెలంగాణాలో సుమారు రెండేళ్ళపాటు అజ్ఞాతంలో ఉండి వందలాది మంది గెరిల్లాలకు సైనిక శిక్షణ ఇచ్చారు.

మిలటరీ క్లాసులు శ్రద్ధగా ఆకళింపు చేసుకునే కామ్రేడ్ మేదరమెట్లను చూసి మేజర్ జైపాల్‌సింగ్ ముచ్చట పడేవాడు. ఒక సాధారణ రైతు యువకుడు మిలటరీ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవడానికి చేసే ప్రయత్నం ఆయనకు ఆశ్చర్యం కల్గిస్తుండేది. నాడు అమరాబాద్ రీజనల్ కమిటీ కార్యదర్శిగా వున్న కామ్రేడ్ లావు బాలగంగాధరరావు గారి వద్ద కామ్రేడ్ మేదరమెట్లను ప్రశంసిస్తుండేవాడు.

***

కామ్రేడ్ మేదరమెట్ల సీతారామయ్య 1924వ సంవత్సరంలో లక్ష్మీనరసయ్య, ఆదెమ్మగార్లకు జన్మించారు. వీరిది నల్గొండజిల్లా వెలిదండగ్రామం. వీరి పూర్వీకులది నాటి ఒంగోలు జిల్లాలోని 'మేదరమెట్ల' అని అంటారు.

మేదరమెట్ల సీతారామయ్యకు చిన్నతనంలోనే తల్లి మరణించింది. వారి ఆర్థికస్థితి అంతంతమాత్రంగా ఉండేది. మేదరమెట్ల విద్యాభ్యాసం వెలిదండల్లో వీధిబడిలో సాగింది. ప్రాథమిక విద్యవరకే ఆయన చదువుకున్నారు. వారిది పేద వ్యవసాయం కావడంతో 11 సంవత్సరాల వయస్సులోనే పశువులను కాయడం, వ్యవసాయ పనులు చేయడం ప్రారంభించారు.

మేదరమెట్ల చిన్ననాటి నుండే నాటకాలు వేసేవాడు. శ్రావ్యంగా పాడేవాడు. 18సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికి గ్రామంలో హుషారైన యువకుడిగా అనేక కార్యక్రమాల్లో మునిగితేలేవాడు.

నిజాం సంస్థానంలో కొంతభాగం జాగీర్దారీపాలన కింద ఉండేది. మరికొంత భాగం పటేల్, పట్వారీ వ్యవస్థద్వారా ప్రత్యక్షంగా నిజాం పాలన కింద ఉండేది. వెలిదండగ్రామంలో పటేల్, పట్వారీల పాలన సాగుతుండేది. ఈ గ్రామంలోను, దాని పరిసర గ్రామాల్లోనూ నిర్బంధంగా పన్నులు వసూలు చేయడం, దౌర్జన్యాలు, దోపిడీలు చేయడం, పేద రైతుల పొలాలను నిర్బంధంగా ఆక్రమించుకోవడం వంటి ఘోరాలకు తలపడేవారు. మొత్తం తెలంగాణా అంతటా ఆనాడు ఇదే పరిస్థితి కొనసాగుతుండేది.

ఆనాడు ఆంధ్రమహాసభ వీటికి వ్యతిరేకంగా పనిచేస్తుండేది. దానిలో నిజాంపాలనపై పాటలు తయారుచేసి యువకులకు నేర్పుతుండేవారు. 'ఆంధ్రమహాసభ' కార్యక్రమాల్లో 'కష్టజీవి' వంటి బుర్రకథకు ఆనాడు బాగా ప్రచారం ఉండేది. ఆ బుర్రకథను మేదరమెట్ల సీతారామయ్య తోటి యువకులతో కలిసి చెపుతుండేవాడు. ఆవిధంగా మేదరమెట్ల 'ఆంధ్రమహాసభ', దానిలో పనిచేసే కమ్యూనిస్టులపట్ల ఆకర్షితులైవాటి కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేవారు.

1944లో కామ్రేడ్ మేదరమెట్ల, అనసూయను వివాహం చేసుకున్నారు. 'ఆంధ్ర మహాసభ కార్యక్రమాల వెల్లువ వెలిదండ గ్రామంలో చాపకింద నీరులా వ్యాపించింది. ఆ గ్రామ పటేలు వక్కవంతుల మట్టయ్య ఈ కార్యక్రమాలను అదుపు చేసేందుకు యువకులను బెదిరిస్తుండేవాడు.

ఒకసారి ఒక పేద వ్యవసాయ పనిముట్టు కోసం అడవినుండి చెట్టును కొట్టుకు వచ్చాడని పటేలు అతనిని గ్రామ చావిడివద్దకు పిలిపించి బెదిరించి జరిమానా విధించాడు. దీనిని మేదరమెట్ల వ్యతిరేకించి మాట్లాడాడు.

ఆ తరువాత కొంతకాలానికి గ్రామానికి లారీలు వచ్చాయి. పోలీసులు అనేక మంది యువకులను వాటిలోకి ఎక్కించారు. వారిలో మేదరమెట్ల కూడా ఉన్నాడు. వీరందరినీ ఎందుకు నిర్బంధించారో తెలియదు. వారిపై కేసు ఏమిటో తెలియదు. విచారణ జరగలేదు. వీరంతా 9 నెలలు జైలు శిక్ష అనుభవించారు.

జైలు నుండి విడుదలై వచ్చిన మేదరమెట్ల పక్క గ్రామమైన కొక్కిరేణిలో కమ్యూనిస్టుపార్టీ సెంటర్ ఏర్పాటుచేసి నడుపుతుంటే దానిలో చేరాడు.

ఆవిధంగా మేదరమెట్ల రహస్య జీవితం ప్రారంభం అయ్యింది.

ఆ రహస్యకాలంలో మేదరమెట్ల ఎన్నో సాహసకృత్యాలు చేసేవాడు. పోలీసుల కళ్ళుగప్పి గ్రామంలో ఎర్రజెండాలు కట్టేవాడు. తెలంగాణా సాయుధ పోరాటంలో గెరిల్లాగా మారాడు. ఆకాలంలో కామ్రేడ్ మేదరమెట్ల నిర్వహించిన వీరోచిత సంఘటనలే పైన పేర్కొన్న ఘట్టాలు.

తెలంగాణా సాయుధ పోరాటం విరమించిన తరువాత కూడా ఆయన చాలా కాలం అజ్ఞాతవాసం చేయాల్సి వచ్చింది. 1956 మే 27న తన స్వగ్రామం చేరుకుని కమ్యూనిస్టుపార్టీలో బహిరంగంగా పనిచేయడం ప్రారంభించారు.

కమ్యూనిస్టుపార్టీలో, అనంతరం సిపిఎంలో ఆయన జిల్లా నాయకులుగా ఉంటూ ఎన్నో ప్రజా ఉద్యమాలు నిర్వహించారు. 1971లో ఆయన మిర్యాలగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుండి సిపిఎం అభ్యర్థిగా పోటీచేశారు. 1981 నుండి 1986 వరకు వెలిదండ గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 1992 నుండి 1995 వరకు వెలిదండ సహకార సంఘ అధ్యక్షులుగా పనిచేశారు. మేదరమెట్ల 1997 అక్టోబర్ 7వ తేదీ అర్ధరాత్రి గుండెపోటుతో తుదిశ్వాసను విడిచారు.

ఆయన భార్య అనసూయ కూడా పోరాటకాలంలోనూ, అనంతరం మేదరమెట్లకు తోడూనీడగా ఉండి కష్టాలు, నష్టాలు, అవమానాలు భరించారు. పోరాట కాలంలో వచ్చిన నిర్బంధాలను తట్టుకోవడానికి ఇల్లూ, వాకిలీ వదిలి అనేకచోట్ల తిరగవలసివచ్చింది. గర్భవతిగా ఉన్న కాలంలో ఆమె అజ్ఞాతంలో ఉంటూ అత్యంత దయనీయ జీవితం గడిపారు. భర్త జాడ చెప్పమని ఆమెను పోలీసులు అనేక చిత్రహింసలు పెట్టారు. 20 ఏళ్ళు కూడా నిండని ఆమె తలపైన కురులు తొలగించారు. గాజులు పగులగొట్టారు. మెడలో తాళి తెంపివేశారు. తన భర్త చనిపోయాడని చెప్పమన్నారు. పెద్ద ఖర్మ చెయ్యమన్నారు. ఆ పోరాటం వలన వచ్చిన నిర్బంధాలు, ఆర్థిక ఇబ్బందులు చేదు జ్ఞాపకాలు కావని, ఎంతో సాహసోపేతమైన చరిత్రలా ఉంటాయని, అన్నిటినీ మించి కమ్యూనిస్టు రాజకీయాలకు పరిచయం బయట ప్రపంచాన్ని చూపిన వెలుగురేఖగా ఆమె భావిస్తున్నారు. కామ్రేడ్స్ మేదరమెట్ల సీతారామయ్య, అనసూయ దంపతులకు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

('కామ్రేడ్ మేదరమెట్ల సీతారామయ్య'
గ్రంథం ఆధారంగా)

కొండబాబు

గోంగూర..!



రాఘవయ్యగారి ఇంటి పెరడు ఆ రోజు పిల్లల ఆటపాటలతో సందడిగా వుంది. సంక్రాంతి సెలవులకు కూతురు, అల్లుడు, కొడుకూ, కోడలూ, మనమలు, మనవరాళ్ళు వచ్చేశారు.

మధ్యాహ్నం వేళ.. చెట్ల కింద.. ఉయ్యాలలూగుతూ ఆడుకుంటున్న పిల్లలను చూస్తూ ఇంటి వెనుక వరండాలో నారాయణమ్మ గారు పప్పు విసురుతోంది. చాలా కాలం తర్వాత మనవలూ, మనవరాళ్ళు తన కళ్ళెదుట ఆడుకోవడం ఆనందంగా ఉందామెకు. పిల్లల వైపు మురిపెంగా చూస్తూ వారి మాటలు ఆలకిస్తోంది.

"సిరీ.. వేరే ఆట ఆడుదాం.. ఇదొద్దు".. ఇందు అంది.

"ఏం?.. ఈ ఆటే బాగుంది" సిరి బదులిచ్చింది.

"నేను ఉయ్యాలే ఊగుతా" బాబిగాడు అడక్కుండానే చెప్పాడు.

"పోనీ క్రికెట్టాడుదామా?"

"ఒరేయ్ వెంకీ.. చెస్‌తో ఒక్కడివే ఆడుకుంటావేరా? మాతో క్రికెట్టాడు"

"పోవే.. మీతో ఆడను. కావాలంటే చెస్ ఆడండి"

"చెస్సా గాడిదగుడ్డు" అంది సిరి.

తన అన్నయ్యను అలా అనగానే వరలక్ష్మి "గాడిద గుడ్డూ గోంగూర లడ్డూ" అని బదులు తీర్చుకుంది.

వాళ్ళ మాటలకు వాళ్ళ మామ్మ నవ్వుకుంది.

***

గాడిద గుడ్డూ పెట్టదు.. గోంగూర లడ్డూ ఉండదు.. కాని మన చర్చ గోంగూర గురించి. ఇళ్ళల్లో నాన్చేసే విషయాలకు 'గోంగూరలెద్దూ' అని తీసి పారేయడం వింటూంటాం. అలాగని గోంగూరను తీసి పారేయం.

పెళ్ళి పంక్తుల కూర
ప్రియమయిన గోంగూర
ఇతరులకు అది నార
ఓ కోయిలమ్మ... అని ఒక వర్ధమాన కవి రాసినట్టు తెలుగువారికి ప్రీతిపాత్రమయినది గోంగూర. చాలాదేశాలు, మనదేశంలోనూ కొన్ని రాష్ట్రాల వారు దానిని ఒకనార మొక్కగా చూస్తారు కానీ, తెలుగు, తమిళ, కన్నడిగులకు అది ఇష్టమైన ఆకు కూర. గోంగూర వచ్చడి, గోంగూరతో వప్పు, మాంసం-గోంగూర వంటి వంటకాలంటే నోరూరని తెలుగువారుండరు. అందుకే ఒక మహానుభావుడన్నట్లు గోంగూర ఆంధ్రమాత.

ఆగ్నేయాసియా దేశాలనుంచి ఈ గోంగూర వచ్చిందంటారు. తానాసీర్ మొదలైన దూరప్రాంతాలనుంచి సుగంధ ద్రవ్యాలతో పాటు వచ్చిందట. తానాసీర్‌ను శ్రీనాథుడు 'తారుదాసీర' అని హరవిలాసంలో పేర్కొన్నారు.

అంతకుముందే మనదేశంలో 'నార' కోసం వాడే గోంగూర ఉండేది. మనదేశంలో ఉన్న గోంగూరను పుంటికూర అనేవారు. 'పుంటి' అంటే పుల్లన అని. కన్నడంలో పుల్లె, తమిళంలో పుళిచ్చికురై ఈ అర్థాన్నే ఇస్తాయి. ఆయా భాషల్లో గోంగూరను అలాగే పిలుస్తారు. వీటి ఉచ్చారణలోనూ, అర్థంలోనూ దగ్గరగా ఉన్న 'పుండి' అనే పదం తొలుత పుల్లని పదార్థమనే అర్థంలో వాడుతూ క్రమేణా 'పుంటి'గా మారి ఉంటుంది. అదే పుంటి కూర, ఉత్తరాంధ్ర, తెలంగాణాలోని కొన్ని ప్రాంతాల్లో నిన్నమొన్నటి వరకూ కొందరు 'పుంటికూర' అనే అనేవారుట.

ఈ పుంటి కూరే ఆ తర్వాత కూర గోంగూర వచ్చాక గోంగూర అయింది. 'గోగు' అనే పదానికి 'గోను' పర్యాయపదం. గోగు నారతో చేసిన సంచులను గోనె సంచులని అంటుంటాం. గోగు సంచులు....గోను సంచులు....గోనె సంచులు... ఇలాగే ఈ పదం అందుకే కామోసు గోంగూర అనగానే ఏదో 'నార' అని తేలిక చేసేవారూ ఉన్నారు. 'కూరనారా' అనే పదం అలాగే వచ్చిందేమో! కులీనవర్గ ప్రజానీకం కొందరు దీనిని అంతగా వాడకపోవడం గమనార్హం. తెలుగునాట మాత్రం దీనికి ఆ వర్గభేదం లేదు. అందరికీ ఆంధ్రమాతే.

"పయర కూర వేచి పచ్చిమిరప పండ్లు
నుక్కళించి పోసి యూరనిచ్చి
కొంత గొంత పొగపికొను గోగు బచ్చడి
చవికి చింక నోరు బివికి తీరు"

అని వేటూరు ప్రభాకర శాస్త్రి గారు 'కడుపు తీపు' అనే కావ్యంలో కడు కమ్మగా రాశారు. మనకు కూడా గోంగూర పేరు వింటేనే నోరూరుతోంది కదూ! ★

పాఠక స్పందన

బుల్లితెర అనర్థాలెన్నో!

జనవరి 20 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో కవర్ స్టోరీ 'బుల్లితెర-అదృశ్య చెర' వ్యాసం చాలా బాగుంది. దీనివల్ల వచ్చే అనర్థాలను చక్కగా వివరించారు. విదేశీ ఛానళ్ళ ప్రవేశంతో జరుగుతున్న సాంస్కృతిక కాలుష్యాన్ని గురించి తెలియజేసిన తీరు బాగుంది.

- మానస, హైదరాబాద్

మంచివ్యాసం

జనవరి 20 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో టూరిస్ట్ గైడ్ శీర్షికన ప్రచురించిన 'అజంతా గుహల్లో తథాగతుడు' వ్యాసం మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది.

- పుట్టా శ్రీనివాసరావు, లక్కవరపుకోట, విజయనగరం

ఆనందపరచిన ఆరోగ్యం

జనవరి 20 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో ఆరోగ్యం శీర్షికలో ప్రచురించిన 'అతినీలలోహిత వికిరణం - పిల్లలకు హానికరం' వ్యాసం మమ్మల్ని ఎంతో ఆనందపరిచింది. రచయితకు అభినందనలు. అలాగే టూరిస్ట్ గైడ్ శీర్షికకూడా మమ్మల్ని ఎంతో ఆకర్షించింది.

- డా॥ ఎస్.సి.రావు, శ్రీదేవి, ఆదిలక్ష్మి, మల్లంపేట, విజయనగరం

అవార్డుకే గర్వకారణం

సుప్రసిద్ధ సంగీతకారుడు అంజాద్ అలీఖాన్‌కు తాన్‌సేన్ పురస్కారాన్ని ఇవ్వడం అవార్డుకే గర్వకారణం. ఇంతగొప్ప సంగీతకారుని జీవిత చరిత్రను తెలుసుకోవడం ఎంతో ఆనందం కలిగించింది.

- మేడూరు సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

వాస్తవ పరిస్థితులను కళ్ళకు కట్టింది

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రచురించిన కవర్ స్టోరీ 'సంక్రాంతి వెలుగులు కొందరికే' వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టింది. ఆరుగాలం శ్రమించి పండించిన రైతన్నకు గిట్టుబాటు ధర లేని నేటి పరిస్థితులలో సంబరంగా సంక్రాంతిని జరుపుకునే పరిస్థితి లేదు. నింగి నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సంక్రాంతిని కాంతి విహీనంగా జరుపుకోవలసి వస్తోంది. గతంలోని సంక్రాంతి విశిష్టతను పెద్దల మాటలతోనే అందించటం బాగుంది. కులాతీత వివాహ వేదిక చాలా మంచి శీర్షిక

- బట్టా రామకృష్ణ, సౌత్‌మోపూర్ గ్రామం, నెల్లూరు,

- తాళ్లూరి చిట్టిబాబు, దుర్గావరప్రసాద్, లంకలకోడేరు, పశ్చిమ గోదావరిజిల్లా